SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 195 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 24 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## కాక్రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ కూడా డౌన్

▪ కేంద్రంపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు ▪ "కాక్రోచ్‌లకు ఎందుకు భయపడుతున్నారు?" అంటూ ప్రశ్న




2

యువతలో విపరీతమైన ఆదరణ సంపాదించుకున్న సోషల్ మీడియా ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పార్టీకి చెందిన ఎక్స్ అకౌంట్ నిలిపివేత, ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ హ్యాకింగ్ ఆరోపణలు సంచలనం రేపగా.. తాజాగా అధికారిక వెబ్‌సైట్ కూడా పనిచేయడం ఆగిపోయింది. 4



## వికసిత భారత్‌కు యువతే బలం

దేశవ్యాప్తంగా 19వ విడత 'రోజ్‌గార్ మేళా' ప్రారంభం

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- సికింద్రాబాద్ వేదికగా 218 మందికి ఆర్డర్లు అందజేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- ఏఐటీ కర్మయోగి ద్వారా నిరంతరం నైపుణ్యాలను పెంచుకోవాలని అభ్యర్థులకు సూచన

**సమయం న్యూస్, సికింద్రాబాద్:** దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ వారిని సాధికారత వైపు నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక అడుగు వేసింది. జాతీయ స్థాయిలో 19వ విడత 'రోజ్‌గార్ మేళా'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా మొత్తం 47 ప్రధాన ప్రాంతాలలో ఒకేసారి నిర్వహించిన ఈ ఉత్సవంలో.. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, బ్యాంకులలో కొత్తగా ఎంపికైన 51,000 మందికి పైగా అభ్యర్థులకు ఏకకాలంలో నియామక పత్రాలను అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, గుంతకల్లు, గుంటూరు కేంద్రాలలో ఈ ఉపాధి మేళా విజయవంతంగా జరిగింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ భోయిగూడలోని 'రైల్ కళా రంగ్' వేదికగా జరిగిన ప్రాంతీయ సదస్సుకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 218 మంది

మిగతా 2 లో





## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు



- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినెట్ కీలక భేటీ నిర్ణయం

**సమయం న్యూస్, హైదరాబాద్:** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది.

మిగతా 2 లో

## యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన 2



## తొలి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్

యాప్ రూపొందించినట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి 2



తెలంగాణ పోలీసు శాఖలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునాతన సాంకేతికతల వినియోగానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. నేర పరిశోధన, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు వేగవంతమైన సేవలందింపులో సాంకేతికత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



## ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసలు సంపద
- యోగా, ధ్యానం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని
- ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి 'ఏఐ డాక్టర్'
- ఇంటి వద్దే 42 రకాల ఉచిత వైద్య పరీక్షలు
- 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు

వివరాలు 5లో

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం

వైసీపీకి సీఎం చంద్రబాబు హెచ్చరిక 5

## ఎండలతో అప్రమత్తం

వచ్చే 3 రోజులు పెరగనున్న వడగాల్పుల తీవ్రత



3

- ప్రజల ప్రాణ రక్షణకు ప్రాధాన్యత
- ఎండల ధాటికి 7 జిల్లాల్లో 16 మంది మృతి
- బాధితులకు రూ.4 లక్షల నష్టపరిహారం
- రద్దీ ప్రాంతాల్లో నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


## సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత

సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని కల్వకుంట్ల కవిత విమర్శించారు.

3





2

## న్యాయవాదిని కారుతో ఢీకొట్టి చంపిన దుండుగులు

- మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన
- కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

## డ్రోన్లు, రోబోల వినియోగం పెరగాలి

- సాగులో ఆధునిక సాంకేతికత!
- విత్తన వారోత్సవాలు ప్రారంభం
- మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- పంట మార్పిడితోనే లాభాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు 3లో..



## పాలిసెట్ ఫలితాలు విడుదల

82.94 శాతం ఉత్తీర్ణత నమోదు

ఈసారి కూడా బాలికలదే పైచేయి

ఎంపీసీ విభాగంలో 11 మందికి టాప్ ర్యాంకులు

2





# పుష్కరాలకు వేయికోట్లు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# తొలి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్

## యాప్ రూపొందించినట్లు సజ్జన్నార్ వెల్లడి

**హైదరాబాద్, మే 23:** శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే అగ్రగామిగా ఉన్న తెలంగాణ పోలీస్ శాఖ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో మరో చారిత్రాత్మక అడుగు వేసింది. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో కృత్రిమ మేధస్సు, అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్ అధికారికంగా వెల్లడించారు. సమకాలీన సమాజంలో మారుతున్న నేరాల శైలిని అరికట్టడానికి సాంకేతికతను జోడించడం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. శనివారం డీజీపీ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేర పరిశోధనను మరింత వేగవంతం చేయడానికి, శాంతిభద్రతలను పటిష్టంగా పర్యవేక్షించడానికి, అలాగే ప్రజలకు పారదర్శకమైన సేవలను త్వరితగతిన అందించడంలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషించబోతోందని వివరించారు. ఈ నూతన విప్లవాత్మక మార్పులను పర్యవేక్షించేందుకు మరియు క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి డీజీపీ కార్యాలయంలో ఒక 'ప్రత్యేక టెక్ టీమ్' (సాంకేతిక బృందం)ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ అత్యాధునిక ఏఐ ఆధారిత పోలీసింగ్ కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు, ప్రస్తుతం పోలీస్ శాఖలో విడివిడిగా సేవలందిస్తున్న ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లైన సీసీటీఎన్ఎస్, హెచ్ఆర్ఎమ్ఎస్, ప్రజలకు రక్షణ కల్పించే 'హాక్ఐ' అప్లికేషన్‌ను ఒకే సమగ్రమైన (ఇంటిగ్రేటెడ్) నెట్‌వర్క్ కిందకు తీసుకురావడానికి చురుగ్గా చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ వెల్లడించారు. దీనివల్ల సమాచార మార్పిడి మరింత సులభతరమై, నేరగాళ్ల గుట్టు రట్టు చేయడం పోలీసులకు మరింత సులువు కానుంది. తెలంగాణ ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మెరుగైన, సురక్షితమైన పోలీసింగ్ సేవలు అందించడమే తమ శాఖ ప్రధాన లక్ష్యమని డీజీపీ పునరుద్ఘాటించారు. రాబోయే భవిష్యత్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా.. మరింత 'స్మార్ట్', 'ఫాస్ట్' పోలీస్ వ్యవస్థను నిర్మించేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఉన్నతాధికారులను, సాంకేతిక బృందాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ ఏఐ సాంకేతికత అందుబాటులోకి వస్తే సైబర్ నేరాల నియంత్రణతో పాటు క్షేత్రస్థాయి పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు వస్తాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి.

# రేపటి నుంచి 'రైతు గోస- బీజేపీ భరోసా'

**హైదరాబాద్, మే 24:** ఈ నెల 25 నుంచి 'రైతు గోస- బీజేపీ భరోసా' పేరిట పోరుబాట నిర్వహించేందుకు భాజపా సిద్ధమవుతోంది. తొలిరోజు తాండూరులో.. రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో.. మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ ఇందులో పాల్గొననున్నారు.

# మూడోసారి పెట్రో ధరల పెంపు

## పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు

**న్యూఢిల్లీ, మే 24:** పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.

# వికసిత భారత్‌కు యువతే బలం

మొదటి పేజీ తరువాయి

నూతన ఉద్యోగులకు ఆయన తన చేతుల మీదుగా నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ ఘనమైన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ సిద్ధార్థ్ కటి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ మరియు ఇతర కేంద్ర మంత్రిత్వ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## వికసిత భారత్‌కు యువతే బలం: ప్రధాని మోదీ

ఈ సందర్భంగా జాతీయ స్థాయిని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ.. 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలు దక్కడం దేశ ప్రగతిలో ఒక కీలకమైన సందర్భమన్నారు. రైల్వే, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్యా రంగాలలో కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న యువతను ఆయన అభినందించారు. వీరంతా ఇప్పుడు దేశం యొక్క 'వికసిత భారత్' ప్రయాణంలో అత్యంత ముఖ్యమైన భాగస్వాములుగా మారారని నొక్కి చెప్పారు. "ఏ ప్రభుత్వ సంస్థకైనా ప్రజలే నిజమైన బలం. కొత్తగా చేరిన వారు కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సమాజం పట్ల బాధ్యతతో, పూర్తి చిత్తశుద్ధితో, నిజాయితీతో పనిచేయాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ వారి నమ్మకాన్ని బలోపేతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ జ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, ఇందుకోసం కేంద్రం ప్రవేశపెట్టిన డిజిటల్ శిక్షణా వేదిక 'ఐగాట్ కర్మయోగి'ని ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రధాని సూచించారు.

## ఇది యువత సాధికారతకు ప్రతీక: కిషన్ రెడ్డి

సికింద్రాబాద్ సభలో కేంద్రమంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో దేశంలోని యువత సాధిస్తున్న సాధికారతకు ఈ 'రోజ్‌గార్ మేళా' ఒక నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక అరుదైన సేవ భాగ్యమని, లంచగొండితనానికి తావులేకుండా దేశ భక్తితో, నిరుపేదలకు సేవలందించే గుణంతో ముందుకు సాగాలని హితవు పలికారు. అంతకుముందు దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్వాగతోపన్యాసం చేస్తూ.. ప్రభుత్వ సేవలో చేరుతున్న యువతకు ఇది ఒక మహత్తర ఘట్టమన్నారు.



నేడు నియామక పత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు కేవలం ఆర్డర్ కాపీలను మాత్రమే కాకుండా, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడే ఒక 'బాధ్యతా పత్రాన్ని' స్వీకరిస్తున్నారని కొనియాడారు.

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

## వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ



**యాదగిరిగుట్ట, మే 23:** యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# న్యాయవాదిని కారుతో ఢీకొట్టి చంపిన దుండుగులు

## మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

## కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్, మే 23:** హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయినుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.





# పాలిసెట్ ఫలితాలు విడుదల!

## 82.94 శాతం ఉత్తీర్ణత నమోదు..

## ఈసారి కూడా బాలికలదే పైచేయి

## ఎంపీసీ విభాగంలో 11 మందికి టాప్ ర్యాంకులు

**హైదరాబాద్, మే 23:** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)-2026 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికి జరిగిన ఈ పరీక్షలో మొత్తం 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతంతో ముందంజలో నిలిచారు. బాలికలు 86.38 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 79.92 శాతంతో సరిపెట్టుకున్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంపీసీ) విభాగంలో మొత్తం 98,029 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 81,307 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో 11 మంది విద్యార్థులు మొదటి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. టాపర్లుగా నిలిచిన వారిలో నామాల లోకేష్ (వరంగల్), బానోతు హేమంత్ (సూర్యాపేట), అల్వియా షిఫాలీ (మంచిర్యాల), మహ్మద్ మహబూబ్ అర్ఫాజ్ అలీ (ఖమ్మం), కోట్ల అపూర్వ (మహబూబ్‌నగర్), అన్నం హరి కృష్ణ (సంగారెడ్డి), జంగాల అవినాష్ గౌడ్ (నల్గొండ), చిలక నంద వరదయ్యపేటహన్ రెడ్డి (ఖమ్మం), రుద్రోజు సాజన్ (సిద్దిపేట), దూరెడ్డి వన్మయ్ రెడ్డి (నాగర్‌కర్నూల్) ఉన్నారు. మ్యాథ్స్, బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (ఎంబీపీసీ) విభాగంలో 98,029 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 79,652 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన కోట్ల అపూర్వ, సిద్దిపేటకు చెందిన రుద్రోజు సాజన్ సంయుక్తంగా టాప్ ర్యాంక్‌ను దక్కించుకున్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



# సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

**వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత**

**హైదరాబాద్, మే 23:** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

# అక్రమంగా ఓట్లు తొలగిస్తే అడ్డుకుంటాం!

**పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరిక**

**పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల అక్రమాలపై మండిపాటు**



**హైదరాబాద్, మే 23:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) పేరిట అక్రమంగా ఓట్లను తొలగించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఖచ్చితంగా అడ్డుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓట్ల అక్రమాలను ఆయన ఈ సందర్భంగా ఉదాహరణగా పేర్కొన్నారు. అక్కడ ఏకంగా 31 లక్షల ఓట్లను చేర్చి, 93 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఇటీవల ఆ రాష్ట్రంలో టీఎంసీ కేవలం 30 లక్షల ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని గుర్తుచేశారు. తెలంగాణలో ఈసారి ధాన్యం దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా పెరిగిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కారణంగానే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పారు. తన పనితీరును ఏఐసీసీ లేదా ముఖ్యమంత్రి బేరీజు వేస్తారని ఆయన పేర్కొన్నారు. పీసీసీ మార్పులకు సంబంధించిన అంశాల్లో ఏఐసీసీ నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఏఐసీసీ దృష్టిలో తెలంగాణ పీసీసీ అత్యుత్తమంగా పనిచేస్తోందని పార్టీ అగ్రనేత కేసీ వేణుగోపాల్ గతంలోనే అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు.

# హెలికాప్టర్‌లోనే సీఎం రేవంత్ రెడ్డి!

**యాదగిరిగుట్ట పర్యటనలో ప్రోటోకాల్ లోపం**

**స్వాగతం పలికేందుకు రాని జిల్లా అధికారులు**

**పావుగంట పాటు చాపర్‌లోనే నిరీక్షణ**

**నిర్లక్ష్యంపై సచివాలయ వర్గాల తీవ్ర ఆగ్రహం**

**బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారుల ఆదేశం**

**హైదరాబాద్, మే 23:** అధికారుల నిర్లక్ష్యం కారణంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, తోటి మంత్రులు సుమారు 15 నిమిషాల పాటు హెలికాప్టర్ లోనే ఉండిపోవాల్సి వచ్చింది. యాదగిరిగుట్ట పర్యటనలో చోటుచేసుకున్న ఈ ప్రోటోకాల్ లోపం ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం యాదగిరిగుట్టలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లారు. పెద్దగుట్టపై చాపర్ ల్యాండ్ అయిన తర్వాత సీఎం, మంత్రులను ఆహ్వానించడానికి జిల్లా ఉన్నతాధికారులు ఎవరూ హెలిప్యాడ్ వద్దకు చేరుకోలేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వచ్చే సమయానికి కనీసం ఒక్క అధికారి కూడా స్వాగతం పలికేందుకు అందుబాటులో లేకపోవడంపై సీఎం, మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్, పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే ముఖ్యమంత్రి పావుగంట పాటు చాపర్‌లోనే నిరీక్షించాల్సి వచ్చిందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యటనలో ఇలాంటి వైఫల్యంపై సెక్రటేరియట్‌లోని భద్రతా దళాలు, ఉన్నతస్థాయి అధికారులు సంబంధిత జిల్లా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ లోపానికి బాధ్యులైన జిల్లా అధికారులపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.



# హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం కల్ల
- ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మే 24:** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# సర్కారు బడులకు కార్పొరేట్ చేయూత!

- విద్యాశాఖతో మూడు సంస్థల కీలక ఒప్పందాలు
- రాంకీ, రహేజా, యశోద సంస్థల భారీ నిధులు
- జవహర్ నగర్, తుక్కుగూడ స్కూళ్ల ఆధునీకరణ
- కొండాపూర్, ఉప్పల్ బడులలో వసతుల కల్పన
- కార్పొరేట్‌ల సేవలను అభినందించిన సీఎం



**హైదరాబాద్, మే 23:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతుల కల్పన కోసం, విద్యాభివృద్ధి కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు కేటాయించేందుకు ముందుకు వచ్చిన రహేజా గ్రూప్, రామ్ కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ సంస్థలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అభినందించారు. శనివారం ముఖ్యమంత్రి సమక్షంలో ఆయా సంస్థల అధినేతలు విద్యాశాఖతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలను రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్ కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోద గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, నూతన తరగతి గదుల నిర్మాణం కోసం ఆయా సంస్థలు భారీగా నిధులను వెచ్చించనున్నాయి.

**అభినందించిన అధికారులు**

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ సి. శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కార్పొరేట్ సంస్థలు ఈ విధంగా తమ వంతు సహాయం అందించడం గొప్ప విషయమని అధికారులు కొనియాడారు.

**రాంకీ సంస్థ:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ లో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్ వరకు తరగతుల కొత్త ప్రాంగణ నిర్మాణానికి మొత్తం ఖర్చులో 40 శాతం అంటే రూ. 19.66 కోట్లు ఖర్చు చేయనుంది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) ఆధునీకరణలో భాగంగా కొత్త తరగతుల నిర్మాణం కోసం 40 శాతం అంటే రూ. 10.4 కోట్లు భరించనుంది.

**రహేజా గ్రూప్:** రంగారెడ్డి జిల్లా కొండాపూర్ లో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్ వరకు తరగతుల కోసం అవసరమైన రూ. 50.50 కోట్లను పూర్తిగా భరించనుంది.

**యశోద హాస్పిటల్స్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) లో ప్రీ ప్రైమరీ, 6, 7 తరగతుల కోసం అవసరమైన రూ. 12.20 కోట్లను కేటాయించింది.

# ఉమ్మడి పాలమూరులో గాలివాన బీభత్సం!

**పిడుగుపాటుకు ఒకరు, రెండు పశువులు మృతి**



**మహబూబ్‌నగర్, మే 23:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో భారీగా ఈదురుగాలులు వీచడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లిలో పిడుగుపాటుకు గురై మల్లయ్య అనే గొర్రెల కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్చంపేట పరిధిలో పిడుగుపడి రెండు పశువులు మరణించాయి. అచ్చంపేట, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అచ్చంపేట మార్కెట్ యార్డులో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం వర్షానికి తడిసిముద్దయింది. పాలమూరు జిల్లా కేంద్రంలో దాదాపు అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో కలెక్టరేట్ వద్ద ఉన్న బస్టాప్ షెడ్ ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. బైపాస్ రోడ్డులో పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో కార్లు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. వనపర్తి జిల్లాలో భారీగా వీచిన ఈదురుగాలులు, వడగళ్ల వాన వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పిడుగుపాటుకు పశువులు మృతి**

అచ్చంపేట మండలం బుడ్డ తండాలో ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. గిరిజన రైతు మోత్యకు చెందిన రెండు పశువులు పిడుగుపాటుకు గురై మరణించాయి. శనివారం సాయంత్రం అకాల వర్షం కురిసిన సమయంలో వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉన్న పశువులపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. వ్యవసాయం కోసం ఇటీవలే లక్షా పదివేల రూపాయల వ్యయంతో ఆ పశువులను కొనుగోలు చేసినట్లు బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని రైతు డిమాండ్ చేశాడు.


# కాన్వాయ్‌ను కుదించిన సీఎం రేవంత్!

**మూడు కార్లతోనే సచివాలయానికి రాక**

**భారీ భద్రత, జామర్లు లేకుండా ప్రయాణం**



**హైదరాబాద్, మే 23 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలకొల్పిన ఆదర్శాన్ని అనుసరిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు. ఎటువంటి భారీ భద్రత, జామర్లు లేకుండా కేవలం మూడు కార్లతోనే ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరగనున్న మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు. మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి సూచించిన పొదుపు చర్యలను పలువురు ప్రముఖులు పాటిస్తున్నారు. ఇందులో భాగంగానే గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా కూడా మే 14న తన కాన్వాయ్ వాహనాల సంఖ్యను సగానికి తగ్గించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కూడా తన కాన్వాయ్ పరిమాణాన్ని 11 వాహనాల నుండి నాలుగుకు తగ్గించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కాన్వాయ్‌ను 50 శాతం కుదించగా, ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా ఇదే విధానాన్ని అనుసరించడం విశేషం. మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం కారణంగా చమురు వాణిజ్యానికి, సరఫరా మార్గాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత తరుణంలో ప్రజలందరూ ఇంధనాన్ని పొదుపు చేసేలా ప్రోత్సహించడమే ప్రధానమంత్రి ఇచ్చిన ఈ పిలుపు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.



# రిజర్వేషన్లతో కొందరికే లబ్ధి!

## అసలైన అర్హులకు ఎప్పుడు న్యాయం..?

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 ఏళ్లు కావొస్తున్నా.. సామాజిక న్యాయం, సమాన అవకాశాలపై చర్చ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడమే రిజర్వేషన్ల అసలు ఉద్దేశం. కానీ, కాలక్రమేణా ఈ వ్యవస్థ కొందరి కుటుంబాలకు మాత్రమే పరిమితమవుతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. తరతరాలుగా ఒకే కుటుంబాలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతుండగా.. అదే వర్గాల్లోని అత్యంత వెనుకబడిన వారికి అవకాశాలు అందకపోవడం ఆందోళన కలిగించే అంశం.**

ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాల పిల్లలకు కూడా అదే రిజర్వేషన్ కొనసాగాలా..? అని ధర్మాసనం ప్రశ్నించడం గమనార్హం. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయితే.. వారి పిల్లలకు కూడా రిజర్వేషన్ అవసరమా?" అనే ప్రశ్న సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రిజర్వేషన్లు శాశ్వత హక్కు కాదనే భావన ఇప్పుడు బలపడుతోంది. ఒకసారి రిజర్వేషన్ ద్వారా ఉన్నత స్థాయికి చేరుకున్న కుటుంబాలు మళ్లీ అదే ప్రయోజనాన్ని తరతరాలకు కొనసాగించుకోవడం వల్ల అసలైన అర్హులు వెనుకబడిపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని గతంలో మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ కూడా ప్రస్తావించారు. క్రీమీ లేయర్ వ్యవస్థను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే సూచించారు.

దేశంలో అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. నిరుద్యోగం, రైతు కష్టాలు, విద్యా వ్యయాలు, ఆరోగ్య సమస్యలు.. ఇలా ఎన్నో ఇబ్బందులతో సాధారణ ప్రజలు పోరాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాల్సింది పోయి.. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజాస్వామ్యంలో అవకాశాలు కొందరికే పరిమితం అయితే వ్యతిరేకత సహజం. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజా అసంతృప్తి ఎలా పెద్ద ఉద్యమాలుగా మారిందో చూశాం. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజాగ్రహం రాజకీయ వ్యవస్థలను కుదిపేసింది. అందుకే పాలకులు ప్రజల భావోద్వేగాలను అర్థం చేసుకుని సమతుల్య నిర్ణయాలు తీసుకోవాలి.

రిజర్వేషన్ల అసలు లక్ష్యం సమాజంలోని అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావడం. కానీ ఒకే కుటుంబాలు, ఒకే వర్గాలు నిరంతరం వాటి ప్రయోజనాలను అనుభవిస్తే.. చివరి వ్యక్తికి న్యాయం ఎలా జరుగుతుంది..? ఇదే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది. రాజకీయాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రిజర్వేషన్ కోటాలో ఒకే కుటుంబాల నుంచి తరతరాలుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అవుతుండటం గమనించాల్సిన అంశం. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ అవసరం. సామాజిక న్యాయం దెబ్బతినకుండా.. నిజంగా అవసరమైన వారికి అవకాశాలు అందేలా విధానాలు రూపుదిద్దుకోవాలి. అవసరమైతే చట్టపరమైన మార్పులు చేయాల్సిన సమయం ఆసన్నమైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**రిజర్వేషన్లు కొందరి శాశ్వత అధికారం కాకూడదు.. సమాజంలోని చివరి వ్యక్తికీ అవకాశం కల్పించే సాధనంగా మారినప్పుడే వాటి అసలు ఉద్దేశం నెరవేరుతుంది.**




# కాక్రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ కూడా డౌన్

- కేంద్రంపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు
- "కాక్రోచ్‌లకు ఎందుకు భయపడుతున్నారు?" అంటూ ప్రశ్న
- కొత్త ప్లాట్‌ఫామ్‌పై పని చేస్తున్నామని వెల్లడి







**న్యూఢిల్లీ, మే 23:** యువతలో విపరీతమైన ఆదరణ సంపాదించుకున్న సోషల్ మీడియా ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పార్టీకి చెందిన ఎక్స్ అకౌంట్ నిలిపివేత, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాకింగ్ ఆరోపణలు సంచలనం రేపగా.. తాజాగా అధికారిక వెబ్‌సైట్ కూడా పనిచేయడం ఆగిపోయింది. ఈ పరిణామంపై స్పందించిన పార్టీ వ్యవస్థాపకుడు ాఎప్త్రఅయవవ్ ణవవజూనెవ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం కాక్రోచ్‌లకు ఎందుకు భయపడుతోంది? ఇది నియంతృత్వ ధోరణి" అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అలాగే "కాక్రోచ్‌లు ఎప్పుడూ చావవు" అంటూ వ్యాఖ్యానించిన ఆయన.. త్వరలోనే కొత్త ప్లాట్‌ఫామ్‌తో ముందుకు వస్తామని తెలిపారు. తమను అణచివేసేందుకు కుట్ర జరుగుతోందని కూడా ఆరోపించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' తొలుత సోషల్ మీడియా వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పరీక్షల లీకులు, యువత సమస్యలు, రాజకీయ వ్యవస్థపై సెటైరికల్ పోస్టులు చేస్తూ తక్కువ సమయంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కోట్లాది మంది ఫాలోవర్లను సంపాదించడంతో ఈ పేజీ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల పార్టీకి చెందిన ఎక్స్ అకౌంట్ భారత్‌లో నిలిపివేయబడగా.. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా హ్యాక్ అయిందని నిర్వాహకులు ఆరోపించారు. ఇప్పుడు అధికారిక వెబ్‌సైట్ కూడా పని చేయకపోవడం కొత్త చర్చకు దారితీసింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తుండగా.. మరికొందరు ఇది కేవలం వైరల్ రాజకీయ వ్యంగ్య ప్రచారమేనని అభిప్రాయపడుతున్నారు. సీజేపీపై వరుస ఆంక్షలు, సాంకేతిక సమస్యల వెనుక అసలు కారణాలేమిటన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే యువతలో ఈ ఉద్యమానికి పెరుగుతున్న ఆదరణ రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు




**టెహ్రాన్, మే 23:** పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

- చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన
- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం



**న్యూఢిల్లీ, మే 24:** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఉఃఉజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ–ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ–ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసలు సంపద
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని
- కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు



**చిత్తూరు, మే 24:** "ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని, డబ్బు ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అసలైన అదృష్టవంతులని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సీఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు ఊరికే అనలేదు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య సేవలు, 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు 'ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్' విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా దీనిని ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని ప్రకటించారు. టెక్నాలజీని వైద్య రంగంలో అందిపుచ్చుకుంటూ రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) డాక్టర్ ఉంటారని సీఎం స్పష్టం చేశారు. దీని ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు మరింత సులువవుతాయని వివరించారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సీఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లేమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.



# కూటమి ధర్మాన్ని కాపాడాలి

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## జనసేన నాయకులకు పవన్ కళ్యాణ్ హెచ్చరిక

## ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలపై పవన్ ఆగ్రహం

## విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా

## చిర్రి బాలరాజుకు నెల రోజులు గడువు

**విజయవాడ, మే 23:** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంలో ఉంటూ పార్టీ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి అటు సీఎం చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం క్రమశిక్షణ ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపారు. శనివారం ఆయన పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను పిలిపించి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో విడివిడిగా సమావేశమైన పవన్ కళ్యాణ్.. వారి ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సరే కఠినమైన చర్యలు తీసుకోవడానికి తాను వెనకాడబోనని వారిద్దరికీ తేల్చి చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేగా, శాసనసభలో జనసేన పార్టీ విప్‌గా వ్యవహరిస్తున్న అరవ శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా చేస్తూ రాసిన లేఖను పవన్ కళ్యాణ్‌కు అందజేశారు. ఇటీవలి కాలంలో అరవ శ్రీధర్‌పై పలు ఆరోపణలు రావడం, దీనికి తోడు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి మాట్లాడినట్లు చెప్తున్న కొన్ని ఆడియో రికార్డులు సోషల్‌లో వైరల్ కావడంతోనే పార్టీ అధిష్టానం ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే తాను కేవలం వ్యక్తిగత కారణాలతోనే శాసనసభ విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అరవ శ్రీధర్ ప్రకటించడం గమనార్హం. తనపై వచ్చిన ఆరోపణలు, వివాదాలపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన వివరణ ఇచ్చినప్పటికీ, అధినేత ఆ వివరణతో సంతృప్తి చెందలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

### వ్యక్తిగత వ్యవహారాలు పదవికి చేటు చేయొద్దు:

మరోవైపు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో భేటీ అయిన జనసేనాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆయన తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పేరుప్రతిష్టలు తెచ్చుకుంటున్న పోలవరం ప్రాజెక్టుకు సమీపంలో ఉంటూ, నియోజకవర్గంలో ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని మందలించారు. "మీ పనితీరు ఏమాత్రం బాగోలేదని నేను స్వయంగా చేపట్టిన సర్వేలో తేలింది. మీరు పనితీరు మార్చుకుని మరింత ముందుకు వెళితేనే భవిష్యత్తులో పార్టీలో కొనసాగే అవకాశం ఉంటుంది.. లేదంటే తదుపరి పరిస్థితిని మీరే ఊహించుకోవచ్చు" అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిర్రి బాలరాజుకు ముఖం మీదే తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన పలు ఆరోపణలపై ఎమ్మెల్యే వివరణ కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బాలరాజు.. తన వ్యక్తిగత, కుటుంబ విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకునేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీనికి అంగీకరించిన పవన్ కళ్యాణ్.. వాటిని సర్దుబాటు చేసుకోవడానికి నాలుగు వారాల (నెల రోజులు) గడువు ఇచ్చారు. అనంతరం పోలవరం నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం ఇప్పటివరకు కేటాయించిన రూ.147 కోట్ల నిధుల వినియోగం, పనుల పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్షించారు. పనులను సకాలంలో, వేగంగా పూర్తి చేయకపోవడంపై అధికారుల తీరును ప్రశ్నించారు. ఇకపై అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, అలాగే తన వ్యక్తిగత వ్యవహారాలను చక్కదిద్దుకుంటానని ఎమ్మెల్యే బాలరాజు జనసేనానికి హామీ ఇచ్చారు. తన సమస్యలను పరిష్కరించుకోవడానికి గడువు ఇచ్చినందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే బాలరాజు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు, కారు ఢీ

## ఒక మహిళ మృతి..పలువురికి గాయాలు



**అంబేడ్కర్ కోనసీమ, మే 24:** ముమ్మిడివరం మండలం అనాతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. 216వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజోలు నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ బస్సు వెళ్తోంది. కాకినాడ నుంచి మామిడికుదురుకు కారు ప్రయాణిస్తోంది. రెండు వాహనాలు అనాతవరం దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ బాధితుల్లో ఓ మహిళ మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

## రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం

## వైసీపీకి సీఎం చంద్రబాబు హెచ్చరిక



**చిత్తూరు, మే 24 :** 'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా.. సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి అని సీఎం అన్నారు. జగన్ నంగనాచిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని విమర్శించారు. మాజీ మంత్రి వివేకా హత్యకేసులో తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. బాబాయ్ హత్యలో తనపై నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు.. జగన్ సన్మానం చేశారని సెటైర్లు గుప్పించారు. తల్లి, చెల్లిని చూడనివారు ప్రజలకు మంచి చేస్తారా? అని ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిపై గొడ్డలి వేటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని విమర్శించారు. అసత్య ప్రచారాలతో జగన్ అండ్ కో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? అని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకో నాటకమాడుతున్నారని విమర్శించారు. జగన్ అధికార దాహానికి తల్లి, చెల్లె అతీతం కాదని అన్నారు. హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్లతో డ్రామాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. రప్పా.. రప్పా అని జగన్ కటౌట్లకు జంతువుల రక్తం చల్లుతున్నారని విమర్శించారు. తన దగ్గర తోకజాడిస్తే కట్ చేస్తా.. ఇక్కడుంది 1995 నాటి సిబిఎన్ అని ప్రస్తావించారు. జగన్.. ముందు నీ ఇంట్లో సమస్యలు చూసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని చెప్పుకొచ్చారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అని పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## మోదీ 3.0 పాలనలో ఏపీకి భారీ ప్రాజెక్టులు

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## రోజ్‌గార్ మేళాలో 120 మందికి నియామక పత్రాల పంపిణీ



**గుంతకల్లు, మే 23:** తెలుగు రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మోదీ 3.0 పాలనలో దక్షిణ భారతదేశంలో అత్యధిక ప్రయోజనాలు పొందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. గత రెండేళ్లలో ఏపీలో రూ.3 లక్షల కోట్లకుపైగా అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా' కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 120 మంది అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం శివప్రసాద్, డీపీఓ హెచ్.ఎల్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, 2022 అక్టోబర్ 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 11 లక్షలకు పైగా ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. ప్రస్తుతం 19వ విడతలో భాగంగా దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో మరో 51 వేల మందికి నియామక పత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాల కాలంలో ఉద్యోగ నియామకాలలో అవినీతి, లీకేజీలు, పైరవీలు ఉండేవని, మోదీ ప్రభుత్వంలో మాత్రం పూర్తిగా మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగాలు పొందిన యువత నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. "దేశం ముందు... కుటుంబం తర్వాత" అనే భావనతో ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కర్మయోగి పోర్టల్ ద్వారా ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇరాన్-అమెరికా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాల కారణంగా ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సంక్షోభంలో ఉన్నాయని, భారత్ ఆ ప్రభావానికి గురికాకుండా ఉండాలంటే ప్రధాని మోదీ సూచించిన 'సప్తసూత్రాలు' పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత, వంటనూనె వినియోగ నియంత్రణ, సేంద్రీయ వ్యవసాయం, వర్క్ ఫ్రం హోమ్ వంటి అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధికి గత 12 ఏళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. ఏపీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న కేంద్రం అమరావతి అభివృద్ధికి రూ.58 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించిందన్నారు. పోలవరం సహా అనేక ప్రాజెక్టులకు భారీగా నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రాలకు వేగంగా అభివృద్ధి సాధ్యమవుతోందని, ఏపీ ఇందుకు నిదర్శనమని బండి సంజయ్ అన్నారు. మోదీ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా అమలు చేస్తోందని తెలిపారు.

# మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

- ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్
- ఫామ్ 1,2,3,4 అప్డేషన్ త్వరితగతిన చేపట్టాలి



**నిజామాబాద్/ హైదరాబాద్ , మే 23 ( సమయం న్యూస్) :** హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ మరియు రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్. పాల్గొన్నా

# మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి..

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం మే23( సమయం న్యూస్). :** ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, లోడింగ్ మరియు రవాణా ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మొక్కజొన్న నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులను అడిగి లారీల అందుబాటు, లోడింగ్ పనుల పురోగతి, రోజువారీ తరలింపు సామర్థ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చి మొక్కజొన్న నిల్వలను వేగవంతంగా తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతం, వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఎందుకు లేరని సిబ్బందిని ప్రశ్నించి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులను దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్‌లను పరిశీలించి ప్రతి ఉద్యోగి విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది సెలవుల వివరాలు, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి సమాచారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ గది, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను ప్రత్యేకంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, మందులు, పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలిన వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలు అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు . ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక వైషమ్యాలకు చరమగీతిక

- సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలిచిన హజ్రత్ ఇంకుషావళి దర్గా.
- అక్కడ...మతస్థులెవరో అప్రస్తుతం...ఆధ్యాత్మికతే ప్రధానం.విశ్వాసాలు వేరైనా ఆ ప్రార్థన మందిరంలో జరిపే ప్రార్థనలపై భక్తులకు ఆచంచల విశ్వాసం.
- మత,వర్గ,సామాజిక వైషమ్యాలకు అక్కడ తావులేదు.... సామరస్యానికి అంతులేదు.ఎనిమిది వందల యాభై ఏళ్ళకు పైగా ఇదే తీరున కొనసాగుతున్న ఆ ప్రశాంత ఆధ్యాత్మిక ప్రదేశం బిజిగిర్ షరీఫ్ దర్గా...మానవీయ విలువలకు రాచమార్గం.



**దర్గా చరిత్రపై ప్రత్యేక కథనం...**

ఎవరే మత విశ్వాసానికి చెందినా అందరు అక్కడ హజ్రత్ సయ్యద్ ఇంకుషావళిని ఆరాధిస్తారు. ఈ దర్గా విభిన్న మతాల విశ్వాసాలు, సంస్కృతులకు నెలవుగా విలసిల్లుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. వైషమ్యాలు అసలే కానరాని ఈ చోట హిందు ముస్లిం,క్రైస్తవులు, సిక్కులు సోదర భావం ప్రదర్శిస్తారు. ప్రజల విశ్వాసాలకు చారిత్రక చిహ్నంగా నిలిచిన ఈ దర్గాకు ఎనిమిది వందల యాభై సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది.

**దర్గా ప్రాశస్త్యం:**

జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వున్న బిజిగిర్ షరీఫ్ గ్రామంలో ని ఈ దర్గాలో ఇస్లాంతో పాటు విశ్వమానవ సమానత్వాన్ని చాటిన సోదరులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహ్ అలై, హజ్రత్ సయ్యద్ ఆజ్మత్ షావళితో పాటు వారి కుమారులైన హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి సమాధులున్నాయి. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ దర్గా దగ్గర విశాలమైన గుట్టలు, ప్రకృతిరమణీయత, ఆహ్లాదకరమైన వాతావరణానికి అనుసంధానమై ఉంది. చారిత్రక కట్టడాలు, చుట్టూ అందమైన కమాన్ నిర్మాణాలు ఉన్నాయి. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్ లోని సూక్తులను ప్రజలకు తెలియజేస్తూ విశ్వమానవ సమానత్వాన్ని చాటుతు అరబ్బు దేశం నుండి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తు బిజిగిర్ షరీఫ్ గ్రామానికి చేరుకొని దర్గాను నిర్మించుకున్నా హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు,బాదితుల పట్ల చూపిన కరుణ దయవల్ల ఎందరో ప్రజలు సుఖశాంతులతో జీవనం గడుపగలిగారు నిష్టలతో వేడుకునే భక్తుల కోరికలను హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి తీర్చుతారని ప్రసిద్ధి వీరి సంస్మరణార్థం ప్రతి ఏటా బక్రీద్ పండుగ సందర్భంగా మూడు రోజులపాటు సందల్, ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

**భక్తుల కొంగు బంగారం బిజిగిర్ షరీఫ్ దర్గా**

**భక్తుల నమ్మకం:-**

మానసిక రోగుల రుగ్మతులను పారద్రోలుతు దశదిశలో వ్యాపిస్తున బిజిగిర్ షరీఫ్ దర్గా అంటే ఈ ప్రాంతంలో తెలియని వారుండరు. ఈ దర్గాను సందర్శించే వారు మానసిక, శారీరక ఇబ్బందులు తొలిగి ఆరోగ్యవంతులుగా తయారవుతారని భక్తుల విశ్వాసం నిత్యం వివిధ ప్రాంతాల నుండి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులతో దర్గా ఎంతో సందడిగా ఉంటుంది. ప్రజల భక్తి విశ్వాసాలకు చరిత్రక చిహ్నంగా నిలిచిన ఈ దర్గాపై భక్తులకు ఎనలేని విశ్వాసం ఉంది.

అనేక రుగ్మతులు దీర్ఘకాలిక రోగాలు, మానసిక రోగాలు నయం కావాలని తమ పిల్లలకు మంచి పెళ్ళి సంబంధాలు రావాలని, పాడిపంటలు పండాలని,ఉన్నత ఉద్యోగాలు సాధించాలని చదువు ఆరోగ్యం బాగుండాలని తమ కోరికలను ఒక్క కాగితం మీద వ్రాసి హజ్రత్ ఇంకుషావళి సమాధి వద్ద ముడుపులు కడుతారు. తమ మొక్కులు తీరగానే ముడుపును విప్పి ఆది, గురు, శుక్రవారాల రోజులలో "కందుర్లు" పేరిట తమ మొక్కులు తీర్చుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులతో కలిసి సామూహిక భోజనాలు చేస్తారు. సంతానం లేని వారికి ఇక్కడ వేడుకున్నక పిల్లలు పుడితే వారి తలనీలాలు ఇక్కడే సమర్పిస్తారు. అనారోగ్యం,వివిధ సమస్యలతో వచ్చినవారు రోజుల తరబడి దర్గా వద్ద ఉండీ ప్రార్థనలు చేస్తే ఏ కోర్కైనా తీరుతుందనే విశ్వాసం భక్తులలో ఉండగా, రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ వంటి ఇతర ప్రాంతాల వారు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. దర్గా ఎదురుగా ఉన్న అతిపురాతనమైన వేపచెట్టు ఆకులు సందల్ షరిఫ్ సమయంలో తింటే రోగాలు నయమవుతాయని వేప ఆకులు తియ్యగా ఉంటాయని భక్తుల నమ్మకం.

**భక్తుల వితరణ:-**

1991లో కీర్తిశేషులు ఎం.ఏ.సత్తార్ ఖాద్రి దర్గా వద్ద నాలుగు మీనార్ ల నిర్మాణం,రేకుల షెడ్డు నిర్మాణం, బోర్ వెల్,రెండు మంచినీటి ట్యాంకుల నిర్మాణం,జామే మస్జిద్ ముందు రేకుల షెడ్డు నిర్మాణం పనులు చేశారు. కొత్తగూడెంకు చెందిన భక్తుడు గాజి గోవర్ధన్ దర్గా వద్ద సుమారు ఏడు లక్షల రూపాయల విలువజేసే షెల్టర్ నిర్మాణం మరియు పన్నెండు లక్షల రూపాయల విలువజేసే స్లాబ్ మరియు మార్బుల్ స్టోన్, దర్గాలోని సమాధులకు సుమారు మూడు లక్షల రూపాయలతో మక్రాన రాయితో ఖద్దరుల నిర్మాణం చేసినారు. దర్గా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో రామగుండంకు చెందిన హాజీ బాబర్ సలీం పాషా దర్గా చుట్టు స్లాబ్ మరియు మార్బుల్ స్టోన్ నిర్మాణం చేసినారు. దర్గా లోపల బయట అద్దాలు అమర్చినారు. సుమారు మూడున్నర లక్షలతో దర్గా పైన సిమెంట్ పని చేయించినారు. హైదరాబాద్ కు చెందిన మిర్జా జహంగీర్ బేగ్ అనే భక్తుడు దర్గా లోపల సుమారు లక్ష రూపాయలతో జూమర్ లైటింగ్ అమర్చినారు. భక్తుల త్రాగునీరు సౌకర్యం కొరకు మంచెరియాల్ కు చెందిన నల్ల శంకర్ అనే భక్తుడు బోర్ వేల్ మరియు మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేసినారు. బెల్లంపల్లి కు చెందిన టి శ్రీనివాస్ అనే భక్తుడు హజ్రత్ ముర్తుజాషావలి దర్గా లోపల అద్దాలు అమర్చినారు. హజ్రత్ ఆమీనా బీబీ దర్గా చుట్టూ,హజ్రత్ అఫ్జల్ బీ దర్గా చుట్టూ సుమారు రెండు లక్షల రూపాయలతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసినారు. కొత్తగూడెంకు చెందిన గాజి గోవర్ధన్ ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు గత 17 సంవత్సరాల నుండి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కొత్తగూడెంకు చెందిన కీర్తిశేషులు శ్రీ గాజీ గోవర్ధన్ గారి మిత్ర బృందం దర్గా పైన సుమారు లక్షా డెబ్బై వేల రూపాయలతో సిమెంట్ డిజైనింగ్ పనిచేయించినారు. హనుమకొండకు చెందిన మహమ్మద్ అలీ ముర్తుజా సమాచార శాఖ రిటైర్డ్ ఉద్యోగి అనే భక్తుడు హజ్రత్ ఆమీన బీబీ దర్గా మరియు హజ్రత్ అఫ్జల్ బి మా దర్గా కు 4 లక్షలు , ఆసిఫ్ రెహమాన్ హన్మకొండ కు చెందింది య-ంవకుడు ముస్లిం మహిళలు ప్రార్థన చేయుటకు మహిళా మస్జిద్ కు సుమారు 5 లక్షలతో మరమ్మతులు, పిఓపి పనులు, స్లాబ్ నిర్మాణం పనులు చేయించినారు. హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ అస్లాం అనే భక్తుడు సుమారు యాభై వేల రూపాయలతో ఎలక్ట్రిక్ వైరింగ్ పనులు చేయించినారు. కొత్తగూడెం కు చెందిన సతీష్,రాజు వారి మిత్రబృందం దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం రెండు గదులకు ప్లాస్టరింగ్ పని,రేకుల షెడ్డు,మంచినీటి ట్యాంక్ నిర్మాణం పని చేసినారు.

**ప్రభుత్వం తరపున పలు నిర్మాణాలు:**

1996లో అప్పటి హనుమకొండ ఎంపీ కమాలుద్దీన్ అహ్మద్ గెస్ట్ హౌస్ నిర్మాణం,2001లో జమ్మికుంట మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అంకుషావలి దర్గా ముందు సిసి రోడ్డు, మంచినీటి బావి నిర్మాణం పని పూర్తి చేశారు. అప్పటి హనుమకొండ ఎంపీ చాడా సురేష్ రెడ్డి లక్ష రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం పని పూర్తి చేశారు. అలాగే 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి హుజురాబాద్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉర్స్ ఉత్సవాలలో హాజరై దర్గాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు దర్గా వద్ద నాలుగు బోర్ వెల్స్, పర్యాటక శాఖ నిధులతో 25 లక్షల రూపాయలతో 12 రూముల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, వాణిఖీ నిధులతో 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం,ఐదు లక్షల రూపాయలతో జామే మస్జిద్ నిర్మాణం, పదిహేడు లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం,ఎనిమిది లక్షలతో కబేళ నిర్మాణ పనులు పూర్తి చేశారు. బిజిగిర్ షరీఫ్ దర్గా చరిత్రను దశదిశాల చాటుతూ దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొరకు అప్పటి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు,రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు.

**ఉర్సు ఉత్సవాలు:-**

ఇస్లామిక్ సంవత్సరాదిలో చివరి మాసం అయిన జిల్ హజ్ మాసంలో పదవ తేదిన అనగా బక్రీద్ పర్వదినాన సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావళి మహ్మద్. అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో జరిగే చాదర్ గుల్ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైదబాద్ నుండి తెచ్చిన చాదర్లు సమాధులను అలంకరిస్తారు. బక్రీద్ పండుగ రాత్రి ముఖ్య ఘట్టమైన సంధల్ షరీఫ్(గ్రంధలేపనం)ను మొల్లపల్లె మరియు పెద్ద బిజిగిర్ షరీఫ్ గ్రామాల నుండి ఉత్సాహ పూరిత వాతావరణంలో భక్తులు మేళతాళాల మధ్య సంధల్ షరీఫ్ ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొవచ్చి సమాధులకు అలరింపజేస్తారు. అనంతరం ఫాతేహాఖాని, ప్రార్థనలు చేస్తారు. ఉర్స్ సందర్భంగా మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను ఆలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. దర్గాను, మీనార్లు,చారిత్రాత్మక కట్టడాలకు రంగులు వేయి-ంస్తారు. దర్గాను రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరిస్తారు. భక్తులకు దర్గా ముతవల్లి మొహమ్మద్ అక్బర్ అలీ,దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం,దర్గా కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు తౌఫిక్ హుస్సేన్,దర్గా కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీఈసంయుక్త కార్యదర్శి నయిముద్దీన్,షాహుస్సేన్, సర్వర్,మసూద్ దర్గా కమిటీ సభ్యులు సర్వర్,జలీల్,అహ్మద్, అక్రమ్,తాజ్ తదితరులు సేవలు అందిస్తారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో యువతకు ఉపాధి బాట

## 25 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు మే23( సమయం న్యూస్). :** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాకు చెందిన 25 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువజన ఒ క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ములుగు టాస్క్ సెంటర్‌లో "ఉద్యోగ సాధన -- ప్రతిభకు అవకాశాల అనుసంధానం" అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన ఛాంబర్‌లో ఈ నెల 8న వరంగల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. యువతలోని ప్రతిభను గుర్తించి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హతలు, నైపుణ్యాలు కలిగిన స్థానిక యువతకు



మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రైవేట్ మరియు బహుళజాతి సంస్థల సహకారంతో త్వరలోనే జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఒ క్రీడల అధికారి బి. రామ్ మోహన్, టాస్క్ మేనేజర్ మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగాలు సాధించిన యువత పాల్గొన్నారు.

# మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట,మే,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో మైనర్‌లు వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, మైనర్లు వాహనాలు నడుపుతూ త్రిబుల్ రైడింగ్ నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య తెలిపారు. జిల్లా కేంద్రం లో శనివారం రోజు ట్రాఫిక్ నిబంధనలు పాటించని త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారి పై మొత్తం 35 కేసులు నమోదు చేసి 38000/- జరిమానా విధించడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండక ముందే ద్విచక్ర వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. మైనర్‌లు వాహనాలు నడిపితే కేవలం వారిపైనే కాకుండా తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం మైనర్ వాహనం నడిపితే వాహన యజమానికి భారీ జరిమానా విధించబడుతుంది. సంబంధిత తల్లిదండ్రులు/గార్డియన్లపై కేసులు నమోదు చేయబడతాయి. వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మైనర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ పొందడంపై నిర్దిష్ట కాలం పాటు అనర్హత విధించబడు తుంది. యువత, చిన్న పిల్లలు తాత్కాలిక ఉత్సాహంతో, సరైన అనుభవం లేకుండా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్ లో రాష్ గా వాహనాలు నడపడం వల్ల ప్రాణ నష్టం, తీవ్ర గాయాలు సంభవించే ప్రమాదం ఉందని ఎస్సై పేర్కొన్నారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించకూడదని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు రాజు, నరేష్ పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్





**ఉట్కూరు మండలం, మే,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండల కేంద్ర సమీపంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉట్కూర్ సమీపంలో ఫీడర్ ఛానెల్ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ ఉపాధి కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 5:30 వరకు పనికి రావాలని, ఎండ తీవ్రత పెరిగే లోపు మళ్ళీ తిరిగి ఇంటికి వెళ్లవచ్చని కూలీలకు ఆమె సూచించారు. రోజుకు ఎంత కూలీ పడుతుందని వారిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు కనీస వసతి సదుపాయాలు కల్పించాలని, తాగునీరు తరచూ తీసుకునేలా కూలీలకు చెప్పాలని ఏ పీ వో కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధి కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉట్కూర్ పెద్ద గ్రామ పంచాయతీ అని, ఉపాధి హామీ పనికి కనీసం 150 మంది అయినా ఉండాలని ఏ. పీ.వో ను ఆదేశించారు. మండలంలోని వల్లంపల్లి, బిజ్వార్, నాగిరెడ్డి పల్లి గ్రామాల్లో ఉపాధి పనులలో కూలీల సంఖ్య చాలా తక్కువ ఉందని, సోమవారం నుంచి కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఓ కు సూచించారు. ఉపాధి హామీ పనులు, కూలీల సంఖ్యా వివరాల రోజువారీ నివేదికను తనకు పంపించాలని కలెక్టర్ డిఆర్డిఏ వెంకట్ రాములు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ సర్పంచ్ రేణుకా భరత్, ఎంపీవో,ఏ పీ వో తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 20న పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరణ

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ బోయ శ్రీనివాసులు.**




**నారాయణపేట, మే,23(సమయం న్యూస్) :** శనివారం 23-05-26 జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్లో జూన్ 20న శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడునని న్యాయమూర్తులకు మరియు పోలీస్ అధికారులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలమేరకు ముందుగా పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించాలని ముందుగా పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని ప్రజలు ఈట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ తమ కేసులను రాజ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలి తెలిపారు. పరిష్కారం తగిన కేసులు యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు,చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం కేసులు, కరోనా సమయంలోని పెండింగ్ లో ఉన్న కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తెలిపారు. తదుపరి ఎగ్జిక్యూషన్ పిటిషన్ (జ్యూ), క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్, చీ× ఆక్ట్ పెండింగ్ పెండింగ్ కేసులగురించి ఆరాదీశారు. తదుపరి చీదీఔ కేసులు, చార్జ్ షీట్ దాకలు చేసారా పెండింగ్ లో ఉంటే త్వరగా ఎంక్వయిరీ చేసి ఎగ్జిక్యూట్ చేయమన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొనెల తమ తమ కేసులను రాజ మార్గం ద్వారా, పరిష్కారం పొందేలా చూడమని ఈ సందర్భంగా న్యాయమూర్తులకు మరియు పోలీస్ అధికారులకు రాజీమార్గం ద్వారా 80 నుంచి 95% వరకు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కోర్టులో ఇదివరకు పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇట్టి అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి శ్రీ బోయ శ్రీనివాసులు తెలిపారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు శ్రీ బోయ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి సాయి మనోజ్ , జూనియర్ సివిల్ జడ్జే కే అవినాష్ మరియు పోలీస్ అధికారులు, కోర్ట్ పోలీసులు పాల్గొన్నారు.

# VOA సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్

**కొడంగల్ మున్సిపల్, మే,23(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా కొడంగల్ ఐకెపి, వివోఏలా నిరసన సమ్మె కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్ ఐకెపి.విఓఏ. తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపు మే-రకు18వ తారీకు నుంచి శనివారనికి ఆరవ రోజు సమ్మె నిరసన సందర్భంగా మాట్లాడుతూ... వారికి గౌరవ వేతనం పెంచాలి,ఉద్యోగ భద్రత కల్పించాలి, పనికి భారం తగ్గించాలి,2023 లో అసెంబ్లీలో ప్రస్తుత మంత్రి సితక్క వీరి సమస్యలపై మాట్లాడుతూ వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రి ఐనా తరువాత ఇప్పుడు మర్చిపోయారు అని గుర్తుచేశారు. కార్యక్రమానికి కొడంగల్ మున్సిపల్ రెండవవార్డ్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్ హాజరై వారికి మద్దతుతెలిపారు.



# కాలిఫోర్నియాలో రసాయన లీక్.. 40 వేల మందికి తరలింపు ఆదేశాలు

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఆరెంజ్ కౌంటీ గార్డెన్ గ్రోవ్‌లోని జీకేఎన్ ఏరోస్పేస్ కేంద్రంలో మిథైల్ మెథాక్రిలేట్ రసాయన ట్యాంక్ లీక్ కావడంతో అత్యవసర పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా వేడెక్కిన ట్యాంక్ పేలే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో గార్డెన్ గ్రోవ్‌తో పాటు సమీప నగరాల పరిధిలో సుమారు 40 వేల మందికి తరలింపు ఆదేశాలు జారీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది ట్యాంక్‌ను చల్లబరచడం, రసాయనం కాలువలు/జలవనరుల్లోకి చేరకుండా అడ్డుకట్ట వేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు గాయాలు లేదా ప్రాణనష్టం నమోదు కాలేదని సమాచారం

# భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్.లోకేష్ కుమార్,ఐఏఎస్.

- అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూ తో భూముల మార్కెట్ విలువల సవరణ అంశంపై వీడియో కాన్ఫరెన్స్



**నారాయణపేట, మే,23 (సమయం న్యూస్) :** శనివారం హైదరాబాద్ నుంచి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు రెవెన్యూ తో భూముల మార్కెట్ విలువల సవరణ అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక,అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, ఆర్ . డి.ఓ.రమేశ్ హాజరయ్యారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి..

- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్




**నారాయణపేట,మే,23(సమయం న్యూస్) :** బక్రీద్ పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లాలో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా టీమ్ బక్రీద్ నారాయణపేట ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరిశుభ్రత పాటించండి, రోడ్లపై చెత్త వేయవద్దు అనే అవగాహన బ్యానర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సామాజిక చైతన్యం కల్పించడం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న టీమ్ బక్రీద్ సేవలను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు అబ్దుల్ సలీం అడ్వకేట్, అమీర్నుద్దీన్ అడ్వకేట్, మహ్మద్ తఖీ చాంద్, సర్ఫరాజ్ హుస్సేన్ అన్సారీతో పాటు టీమ్ బక్రీద్ సభ్యులు మరియు కన్వీనర్లు ఫారూఖ్ అహ్మద్, అనీస్ గద్వాల్, హాఫిజ్ మహ్మద్ తఖీ, నజీర్ షాపూరి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 50 శాతం రాయితీపై జనుము విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి

- కొడంగల్ మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత



**కొడంగల్ మండలం, మే,23(సమయం న్యూస్) :** రైతులకు 50% రాయితీపై జనుము విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత తెలిపారు. రైతు సేవా కేంద్రం (AGRIS)లో 100 బ్యాగులు మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ లో 75 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక బ్యాగు మొత్తం ధర రూ. 6,220 కాగా, ప్రభుత్వం 50% రాయితీ ఇవ్వడంతో రైతులు కేవలం రూ. 3,110 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం మరియు ఆధార్ కార్డు తీసుకొని సంబంధిత కేంద్రాలకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోడంగల్ మండల రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్. శ్రీలత కోరారు.

# 2027. జనాభా లెక్కలు జనగణన కార్యక్రమాన్ని ప్రారంభించిన ..

**కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు**



**కొడంగల్ మున్సిపల్, మే, 23(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ రెండవవాడు లో 2027 తెలంగాణ లో భారత జన గణన కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన రెండో వార్డ్ కౌన్సిలర్ ఆర్ .వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు జన గణనకు కొడంగల్ మున్సిపాలిటీ ప్రజలు అందరూ సహకరించాల్సిందిగా. వారు కోరారు. ఈ కార్యక్రమంలో వి రవీంద్ర చారి బాకారం బాల్రెడ్డి వేణుగోపాల్ బండి గోపాల్ తాండ్ర రఘురాం పాశం కృష్ణ సల్కంపేట రఘు పాశం శ్రీను సెల్కంపేట ఆనంద్ సంఘం శ్రీనాథ్ పష్యం శ్రవణ్ కుమార్ సెల్కంపేట అనిల్ కుమార్ చింతకాయల శ్రీనివాస్ పాశం శరన్ రవి నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో యువతకు ఉపాధి బాట

**-31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



**నారాయణపేట, మే,23(సమయం న్యూస్) :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నారాయణపేట జిల్లాకు చెందిన 31 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యువజన ఢ క్రీడా వారోత్సవాలను పురస్కరించుకొని 6వ రోజున జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 1వ తేదీన మహబూబ్ నగర్ వేదికగా జరిగిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపికైన నారాయణపేట జిల్లా అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆర్డర్ కాపీలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ....యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. తగిన అర్హత, నైపుణ్యాలు కలిగిన స్థానిక యువతీ యువకులకు రాబోయే రోజుల్లో జిల్లా యంత్రాంగం సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది అని పేర్కొన్నారు. జీవితంలో అనుకున్నది సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు. 20 ఏళ్ల తర్వాత మనం ఎలా ఉండాలని అనుకుంటామో అందుకోసం ఈ రోజు మనం ఏం చేయాలో తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదా... పెద్దదా అని కాకుండా ఇష్టంతో పని చేయాలని అప్పుడే అనుకున్నది సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఢ క్రీడల అధికారి వెంకటేశ్ శెట్టి డి.పి.ఆర్.ఓ.రషీద్, ఉద్యోగాలు సాధించిన యువత తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక సాగరమైన పోతంగల్.. ఘనంగా మద్భాగవత ప్రవచనాల ముగింపు....





**పోతంగల్, మే23 (సమయం న్యూస్ ) :-** నిజామాబాదు జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గత వారం రోజులుగా అత్యంత వైభవంగా సాగిన "శ్రీ మద్భాగవత మహాపురాణ" ప్రవచన మహోత్సవం శనివారంతో భక్తిశ్రద్ధల నడుమ ముగిసింది. అన్నపూర్ణ స్థాపనాచార్యులు సద్గురు శ్రీ ఉద్ధవాచార్య మహారాజ్, శ్రీ సిద్ధగురు గోవింద్ మహారాజ్ రామదాసి మాతాజీ ల పుణ్యస్మరణార్థం, శ్రీ సద్గురు గోపాల్ మహారాజ్ రామదాసి మాతాజీ గారి దివ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. అధిక జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి అనగా మే 17వ తేదీ ఆదివారం నాడు ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక ప్రవచనాలు, మే 23వ తేదీ శనివారం అధిక జ్యేష్ఠ శుద్ధ అష్టమి వరకు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ ఏడు రోజుల పాటు నిర్వహించిన రోజువారీ శ్రీ మద్భాగవత ప్రసంగ కథనాల్లో భాగంగా మే 17న ఆది వరాహ అవతార విశిష్టతను, మే 18న గంగా అవతార ప్రసంగాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ ప్రవచనాలను శ్రవణం చేయడానికి పోతంగల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుండి ప్రతిరోజూ అశేష జనవాహిని తరలివచ్చింది. భక్తుల హరినామ స్మరణలు, జయజయధ్వనాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా పురాణ శ్రవణానికి వచ్చే ప్రతి ఒక్క భక్తునికి ప్రతిరోజూ ఉదయం అల్పాహారాన్ని, అలాగే మధ్యాహ్నం రుచికరమైన మహాప్రసాద భోజన వసతిని ఉచితంగా కల్పించారు. అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా సాగడంతో భక్తులు నిర్వాహకులపై ప్రశంసలు కురిపించారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు అన్నదాన మహాసేవ కూడా తోడవడంతో పోతంగల్ మండల కేంద్రంలో అపూర్వమైన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులందరూ ఈ వారం రోజుల వేడుకను ఒక మహోత్సవంలా జరుపుకున్నారు.

# వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS ఆదేశాల మేరకు,

## జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె.అన్వర్ పాషా ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై ఆకస్మిక దాడి ఆరు గురు పట్టివేత

**పరిగి మున్సిపల్, మే,23 (సమయం న్యూస్) :** జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా ఆధ్వర్యంలో పరిగి పట్టణంలో పేకాట స్థావరాలపైన ఆకస్మిక దాడి నిర్వహించారు. పరిగి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఒక భవనంపై కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం ఈ దాడి చేపట్టింది. ఈ దాడిలో పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 31,450/- ల నగదు, పేక ముక్కలు, మరియు 5 మొబైల్ ఫోన్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వెంటనే పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం పై రైతులు మొగ్గు చూపాలి

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**





**మక్తల్ మున్సిపల్,( మం) మే,23(సమయం న్యూస్) :** రైతులు ఒకే రకమైన వరి, పత్తి పంటలు సాగు చేయకుండా కూరగాయలు, ఆయిల్ ఫామ్ తోటలు,పండ్ల తోటల సాగుపై మొగ్గు చూపాలని, అలాగే ప్రకృతి వ్యవసాయం చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. శనివారం మక్తల్ మండలం లోని జక్లేర్ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో గ్రామ భారతి సత్య దర్శనం సహకారంతో ప్రకృతి వ్యవసాయం పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయం పై ఆసక్తి చూపుతున్నారని, ఇది శుభ సూచకం అన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్కీమ్ ప్రవేశ పెట్టిందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వ పరంగా సహకరిస్తాం అని ఆమె చెప్పారు. మార్కెటింగ్ చాలా ముఖ్యమని, బ్లాక్, బ్రౌన్ రైస్ ప్రొడక్షన్, ఆర్గానిక్ ఫామ్ లను సింగిల్ బ్రాండ్ మీద తీసుకు వెళ్ళేందుకు అందరి సహకారం అవసరం అన్నారు. అలాగే ఎఫ్. పీ. ఓ, ఎస్ హెచ్ జీల ద్వారా మార్కెటింగ్ లింక్ అవసరమని తెలిపారు. ఆర్గానిక్ ట్యాగ్ తో విక్రయించడానికి పెద్ద పెద్ద మార్కెట్ల లింక్ ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రం ఏర్పాటు కు, ఫౌండేషన్ సభ్యులు అడిగిన వాటికి ప్రభుత్వ పరంగా తన వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య వైద్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, ఫౌండేషన్ సభ్యులు సత్య నారాయణ, రైతులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ప్రారంభం

**- 530 మంది క్రీడాకారులతో జోష్‌గా ప్రారంభమైన జిల్లా స్థాయి పోటీలు**




**క్రీడా ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎస్ ఎల్ వి ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీని వాస్ రావు మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో క్రీడాకారులు న మోదు చేసుకుని పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, సభ్యులు సుబ్బారెడ్డి, విజయ్ కుమార్, పీవీఎల్ కుమార్, ఏ.వి. రమణా రెడ్డిలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామరాజు, సాయి-ంతేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఏడాది ఏకంగా 530 మంది క్రీడాకారులు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఈ స్థాయిలో పాల్గొనడం వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ యువ క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, క్రీడాకారులు విజయం సాధించాలనే లక్ష్యంతో తమ ప్రతిభను కనబరిచారు. అధికారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న నిర్వాహకులు, కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధుల కృషితో ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ప్రారంభమై క్రీడా వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది.

# జిల్లా లోని మూడు సబ్ డివిజన్లలో శాంతి సమావేశాలు

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ,ఐపీఎస్ ఆదేశాలమేరకు
- రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని
- జిల్లా లోని మూడు సబ్ డివిజన్లలో శాంతి సమావేశాలు







**వికారాబాద్, మే,23(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మూడు సబ్ డివిజన్లలో శాంతి సమావేశాలు నిర్వహించారు. వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు, ఇతర ముస్లిం ప్రతినిధులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, ఐపీఎస్, పాల్గొన్నారు. రాబోయే బక్రీద్ పండుగను జిల్లా ప్రజలందరూ ఎంతో ప్రశాంతంగా,సామరస్యపూర్వక వాతావరణంలో, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరూ పండుగను సంతోషకరమైన వాతావరణంలో జరుపుకునేలా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, శాంతి కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ పండుగ రోజుల్లో తీసుకోవాల్సిన శాంతిభద్రతల చర్యలు, ఈద్గాల వద్ద కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పండుగ సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె చెప్పారు మరియు మున్సిపల్ సిబ్బందికి అందరూ సహకరించాలని కోరారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేసేవారిపై, తప్పుడు వార్తలను ప్రచారం చేసేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని, పరస్పర సహకారం, శాంతిభావంతో బక్రీద్ పండుగను విజయవంతంగా జరుపుకోవాలని, ఏవైనా అవసరాలు ఉంటే వెంటనే పోలీస్ అధికారులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ మేడమ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, ధారూర్ సీఐ రఘు రాములు, వికారాబాద్ సీఐ రఘు కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యేసుదాసు, సబ్ డివిజన్ ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, ఐపీఎస్, ఆదేశాల మేరకు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిగిలో, తాండూరు డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో తాండూరులో శాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

● పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి





**హైదరాబాద్ మే23( సమయం న్యూస్) :** జలమండలి అశోక్ రెడ్డి శనివారం తట్టిఖానా, జూబ్లీహిల్స్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కమాండ్ ప్రాంతాల్లో ట్యాంకర్ల సరఫరా విధానాన్ని పరిశీలించిన ఆయన, ట్యాంకర్ల డెలివరీ ప్రక్రియపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంకర్ల పంపిణీ సమయపాలన, వినియోగదారులకు అందుతున్న సేవల తీరు, ఫిల్లింగ్ స్టేషన్ కార్యకలాపాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అలాగే ట్యాంకర్ల సరఫరా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నదా అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. షెడ్యూల్ ప్రకారం ట్యాంకర్ల సరఫరా తప్పనిసరిగా జరగాలని ఎండీ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ట్యాంకర్ల డెలివరీ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వారం రోజుల పాటు మూడు షిఫ్టుల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఎండీ ఆదేశించారు. వర్షాలు ప్రారంభమయ్యే వరకు ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. అవసరం మేరకే నీటిని వాడాలని, వృథా తగ్గించాలని సూచించారు.

# ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల మే 23 (సమయం న్యూస్):** కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సింగరేణి క్లబ్, బూడకలాన్ గ్రామంలో గల సింగరేణి క్లబ్ లను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లలో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహసీల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్లును మండల తహసిల్దార్ సదానందం తో కలిసి పరిశీలించి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యం దిగుమతి వేగంగా చేసుకోవాలని, అవసరమైన మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులకు నిర్దేశించిన సి.ఎం.ఆర్. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నాకాబంది నిర్వహణ

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, మే,23(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నాకాబంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన చౌరస్తాలు, రహదారులు, చెక్‌పోస్టులు మరియు రద్దీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలను ఆపి వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేసి మొత్తం 18 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు, 211 వాహనాలకు గాను 1,35,755/- జరిమానా విధించడం జరిగింది అని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నాకాబంది కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. నేరాల నివారణ, చోరీలు, అక్రమ రవాణా, మత్తు పదార్థాల తరలింపు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను అరికట్టడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ఈ నాకాబంది కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తలారి నర్సింలు కు ఎంపీ రఘునందన్ నివాళి



**రాయపోల్, మే 23 :** రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు శనివారం రామారం గ్రామానికి చేరుకుని నర్సింలు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నర్సింలు ప్రజలకు అందించిన సేవలను ఎంపీ గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మంకిడి స్వామి,మాజీ అధ్యక్షులు వెంకట్ గౌడ్,. నాయకులు నిల స్వామి,వెంకట్ గౌడ్,గోపాల్,నర్సింలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతు అకాల మరణం వార్తలో నిజం లేదు

● జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, మే 23:( సమయం న్యూస్). :** మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న గణపూర్ గ్రామానికి చెందిన వెంకటాపురం శంకరయ్య అనే రైతు అకాల మరణంపై కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన వార్తల్లో నిజం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుల్చారం మండల తహసీల్దార్ సమర్పించిన నివేదిక ప్రకారం సంబంధిత రైతు గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్టు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన సీరియల్ విధానంలోనే కొనసాగుతోందని వెల్లడించారు. అయితే ధాన్యం కొనుగోలు సమస్యల కారణంగానే రైతు మృతి చెందినట్లు కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తలు అవాస్తవమని తెలిపారు. రైతు మరణాన్ని ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో ముడిపెట్టి ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 30,210 మంది రైతుల ఖాతాల్లో రూ.336.65 కోట్లు నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, కొనుగోలు కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రామగుండం అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, మే 23 (సమయం న్యూస్):** రామగుండం నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల నిర్మాణం, మున్సిపల్ రోడ్లు, డ్రైనేజీ పనులు, రెవెన్యూ శాఖ, ఆర్ & బి, పంచాయతీరాజ్ శాఖ పనులు, 2బీహెచ్‌కే గృహాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పనుల్లో జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పనుల అమలులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీవోలు సురేష్, బి. గంగయ్య, సీపీవో రవీందర్, పీఆర్, ఆర్ & బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారి పోరాటానికి బి ఆర్ ఎస్ పార్టీ పూర్తి మద్దతు

## మాజీమంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు.




**ఇందిరాపార్కు మే 23( సమయం న్యూస్). :** శనివారం ఇందిరా పార్కు వద్ద గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి పునాది ఎంత ముఖ్యమో సెంట్రింగ్ కార్మికులు కూడా అంతే ముఖ్యం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. సెంట్రింగ్ పనిపై ఆధారపడి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 10 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వారి న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సెంట్రింగ్ పని చేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడిన ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. అదేవిధంగా జూ× కార్డులు అందించి వారికి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా ఉండి ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. 15 రోజులలో ప్రభుత్వం స్పందించకుంటే చలో సెక్రెటరీయేట్ ముట్టడికి పిలుపునివ్వాలని అన్నారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని అసెంబ్లీ లోపల, బయట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిలదీస్తామని స్పష్టం చేశారు. స్వరాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలు సంతోషం గా ఉండాలని కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చేది బి ఆర్ ఎస్ ప్రభుత్వమేనని, మీ అన్ని కోరికలను నెరవేరుస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలన కాదని, రాక్షస పాలన అని మండిపడ్డారు. వారికి దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ పేద ప్రజల సంక్షేమంపై లేదని ధ్వజమెత్తారు. కేసులకు భయపడవద్దని, హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. కేసులకు భయపడితే తెలంగాణ రాష్ట్రం సాధించుకునే వాళ్ళమా అని అన్నారు.



# రోహిత్ మనసు గెలుచుకున్నాడు

**కోల్‌కతా, మే 23 :** టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ మరోసారి తన మంచి మనసుతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. మైదానంలో సిక్సర్లతో అలరించే హిట్ మ్యాన్.. మైదానం బయట కూడా అభిమానుల భావోద్వేగాలకు ఎంత విలువ ఇస్తాడో మరోసారి నిరూపించాడు. తనను ఒక్కసారి కలవాలని ఎంతో ఆశపడి నిరాశతో కన్నీళ్లు పెట్టుకున్న ఓ యువతికి ప్రత్యేకంగా వీడియో సందేశం పంపి ఆమెను ఆనందంలో ముంచెత్తాడు. ఇటీవల కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కోసం జినియా అనే యువతి ప్రత్యేకంగా స్టేడియానికి వచ్చింది. తన అభిమాన క్రికెటర్ రోహిత్ శర్మను దగ్గరగా చూడాలని, ఒకసారి మాట్లాడాలని ఆమె ఎంతోకాలంగా కలగంటోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా గంటల తరబడి స్టేడియం బయటే వేచి చూసింది. డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఆటగాళ్లు బయటకు వస్తున్న సమయంలో రోహిత్ కనిపించగానే ఆమె ఉద్వేగంతో "రోహిత్ భాయ్" అంటూ గట్టిగా పిలిచింది. అయితే అక్కడ ఉన్న అభిమానుల హడావుడి, శబ్దాల మధ్య ఆమె పిలుపు రోహిత్‌కు వినిపించలేదు. దీంతో రోహిత్ నేరుగా ముందుకు వెళ్లిపోయాడు. తన కల నెరవేరలేదనే బాధతో ఆ యువతి అక్కడే కన్నీళ్లు పెట్టుకుంది. ఈ దృశ్యాన్ని ఆమె బంధువులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా అది కాస్త వైరల్‌గా మారింది. ఈ వీడియో రోహిత్ శర్మ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించాడు. "క్షమించు.. నీ పిలుపు నాకు వినిపించలేదు. వచ్చేసారి కోల్‌కతా వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తాను" అంటూ ప్రత్యేక వీడియో సందేశం పంపించాడు. రోహిత్ స్పందన చూసిన ఆ యువతి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రోహిత్ శర్మ చేసిన ఈ చిన్న పని ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చగా మారింది. అభిమానుల పట్ల ఆయన చూపిస్తున్న ప్రేమ, గౌరవంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. స్టార్ క్రికెటర్ అయినప్పటికీ అభిమానుల భావోద్వేగాలను అర్థం చేసుకుని స్పందించడం నిజంగా గొప్ప విషయమని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.



# కృనాల్ బౌలింగ్‌పై కావ్య అసహనం

**హైదరాబాద్, మే 23 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో హైదరాబాద్ వేదికగా జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆర్‌సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య వేసిన వింత బౌలింగ్‌పై సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఆర్‌సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడగా.. అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ కూడా భారీ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయితే మ్యాచ్ సందర్భంగా కృనాల్ పాండ్య వేసిన కొన్ని బంతులు ప్రత్యేక చర్చకు దారితీశాయి. సాధారణంగా ఎడమచేతి స్పిన్ బౌలర్ అయిన కృనాల్.. బ్యాటర్లను గందరగోళానికి గురిచేయడానికి అప్పుడప్పుడు భిన్నమైన బంతులు వేస్తుంటాడు. కానీ ఈ మ్యాచ్‌లో అతను వరుసగా బౌన్సర్లు వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కేవలం రెండు ఓవర్లు మాత్రమే వేసిన కృనాల్.. నాలుగు నుంచి ఆరు వరకు బౌన్సర్లు సంధించాడు. స్పిన్ బౌలర్ నుంచి ఇలాంటి బంతులు రావడంతో క్రీజులో ఉన్న బ్యాటర్లు కూడా అసౌకర్యానికి గురయ్యారు. వికెట్ కీపర్ జితేష్ శర్మ కూడా కొన్ని బంతులను అందుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. ఈ దృశ్యాలను స్టాండ్స్‌లో నుంచి గమనిస్తున్న కావ్య మారన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన పక్కన ఉన్న వారితో మాట్లాడుతూ "ఇది ఏ బౌలింగ్?" అన్నట్లుగా చేతులూపుతూ అసంతృప్తిని బయటపెట్టారు. ఆమె రియాక్షన్ కెమెరాలో బంధించబడటంతో వీడియో వేగంగా వైరల్ అయింది. ఆ తర్వాత 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయింది. విరాట్ కోహ్లీ, వెంకటేష్ అయ్యర్ త్వరగా ఔటవ్వడంతో జట్టు ఒత్తిడిలో పడింది. మధ్యలో రజత్ పటిదార్, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్ పోరాడినా ఫలితం లేకపోయింది. చివరకు ఆర్‌సీబీ 200 పరుగులకే పరిమితమవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.



# ప్లే ఆఫ్స్ రేసులో పంజాబ్!

## లక్నోపై 7 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ ఘన విజయం

## శ్రేయస్ అయ్యర్ అజేయ సెంచరీ, ప్రభ్ సిమ్రన్ సింగ్ మెరుపులు

## వృథా అయిన జోష్ ఇంగ్లిస్, ఆయుష్ బదోని పోరాటం

## 15 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానానికి చేరిక

**ఎకానా క్రికెట్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై పంజాబ్ కింగ్స్ అద్భుత విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో శ్రేయస్ అయ్యర్ అజేయ సెంచరీతో చెలరేగడంతో 7 వికెట్ల తేడాతో లక్నోను మట్టికరిపించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో 15 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుని పంజాబ్ తన ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.**



**లక్నో, మే 13 :** లక్నోలోని ఎకానా స్టేడియంలో శనివారం జరిగిన ఈ కీలక మ్యాచ్ లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ 44 బంతుల్లో 72 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు. ఆయుష్ బదోని కేవలం 18 బంతుల్లో 43 పరుగులు, అబ్దుల్ సమద్ 20 బంతుల్లో 37 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ 4 ఓవర్లలో 25 పరుగులిచ్చి 2 వికెట్లు, మార్కో జాన్సెన్ 4 ఓవర్లలో 33 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు. అజ్మతుల్లా ఒమర్జాయ్ కు 1 వికెట్ దక్కింది.



### శ్రేయస్ అయ్యర్ విధ్వంసం..

197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ కు బ్యాటర్లు శుభారంభం అందించారు. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. లక్నో బౌలర్లను చిత్తు చేస్తూ కేవలం 51 బంతుల్లో 101 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. అతనికి తోడుగా ప్రభ్ సిమ్రన్ సింగ్ 39 బంతుల్లో 69 పరుగులు చేసి అద్భుత సహకారం అందించాడు. చివర్లో కూపర్ కాన్నోలీ 10 బంతుల్లో 18 పరుగులు చేశాడు. దీంతో పంజాబ్ మరో 12 బంతులు మిగిలి ఉండగానే 18 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. లక్నో బౌలర్లలో మహ్మద్ షమీ 4 ఓవర్లలో 45 పరుగులిచ్చి 2 వికెట్లు, అర్జున్ టెండూల్కర్ 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు. ప్రిన్స్ యాదవ్ 3 ఓవర్లలో 32 పరుగులు ఇచ్చినా వికెట్ దక్కలేదు.

### సజీవంగా ప్లే ఆఫ్స్ ఆశలు..

ఈ భారీ విజయంతో పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ కు చేరువయింది. తాజా పాయింట్ల పట్టికను పరిశీలిస్తే 14 మ్యాచ్ లు ఆడిన పంజాబ్ కింగ్స్ 7 విజయాలతో 15 పాయింట్లు ఖాతాలో వేసుకుని నాలుగో స్థానానికి ఎగబాకింది. నెట్ రన్ రేట్ ప్లస్ 0.309 తో మెరుగ్గా ఉండటం ఆ జట్టుకు కలిసి రానుంది. ఈ ఓటమితో లక్నో సూపర్ జెయింట్స్ 14 మ్యాచ్ లలో కేవలం 4 విజయాలు నమోదు చేసి 8 పాయింట్లతో పట్టికలో ఆఖరి స్థానంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. రాజస్థాన్ రాయల్స్ 14 పాయింట్లతో ఐదో స్థానంలో, కోల్ కతా నైట్ రైడర్స్ 13 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నాయి. రాబోయే మ్యాచ్ ల ఫలితాలపై పంజాబ్ కింగ్స్ భవితవ్యం ఆధారపడి ఉంది.

# పంజాబ్‌కు కీలక పోరు.. సెహ్వాగ్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 23 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్లేఆఫ్స్ రేసు ఉత్కంఠభరితంగా మారిన వేళ పంజాబ్ కింగ్స్‌కు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరగనున్న మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైతే పంజాబ్ ఆశలు దాదాపు ముగిసే పరిస్థితి ఉండటంతో అభిమానుల్లో టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ భారత ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పంజాబ్ జట్టుకు కీలక హెచ్చరికలు చేశాడు. సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. తర్వాత వరుస పరాజయాలతో ఒత్తిడిలో పడింది. ప్రస్తుతం 13 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో ఉన్న ఆ జట్టు ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే లక్నోపై తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మ్యాచ్‌లో లక్నో స్టార్ బ్యాటర్ మిచెల్ మార్ష్‌నే ప్రధాన ప్రమాదంగా సెహ్వాగ్ పేర్కొన్నాడు. మార్ష్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని, ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడిని అడ్డుకోవడం పంజాబ్ బౌలర్లకు పెద్ద సవాలుగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ బౌలింగ్ విభాగంలో మిడిల్ ఓవర్లలో వికెట్లు తీసే స్థిరమైన బౌలర్ లేకపోవడం జట్టుకు బలహీనతగా మారిందని సెహ్వాగ్ విశ్లేషించాడు. సీజన్‌లో గతంలో ఫైనల్ చేరినప్పుడు కూడా పంజాబ్ బౌలింగ్ అంత బలంగా లేదని గుర్తు చేసిన ఆయన.. ఇప్పుడు కూడా అదే సమస్య కొనసాగుతోందని పేర్కొన్నాడు. మార్ష్ లాంటి దూకుడు బ్యాటర్ ఈ బలహీనతను సులభంగా ఉపయోగించుకునే అవకాశముందని హెచ్చరించాడు. ఇక ధర్మశాల మైదానం నుంచి మ్యాచ్ వేదిక మారడం పంజాబ్‌కు కొంత కలిసొచ్చే అంశమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కొత్త పిచ్, కొత్త పరిస్థితులు ఆటగాళ్లలో కొత్త ఉత్సాహాన్ని తీసుకురావొచ్చని చెప్పాడు. ఒత్తిడిలో ఉన్న జట్టుకు వాతావరణ మార్పు కొంత మేలు చేసే అవకాశముందని వివరించాడు. అయితే పంజాబ్ కేవలం ఈ మ్యాచ్ గెలవడం మాత్రమే సరిపోదు. ఇతర జట్ల ఫలితాలు కూడా వారికి అనుకూలంగా రావాల్సి ఉంటుంది. ముఖ్యంగా ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ ఫలితం కూడా కీలకంగా మారనుంది. రాజస్థాన్ ఓడిపోతే పంజాబ్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత బలపడతాయి. సీజన్ ఆరంభంలో చూపించిన ఆటతీరుకు పంజాబ్ ప్లేఆఫ్స్‌కు అర్హమైన జట్టేనని, చివరి పోరులో వారు విజయం సాధించాలని ఆశిస్తున్నట్లు సెహ్వాగ్ పేర్కొన్నాడు.





# ఏఐతో నకిలీ బికినీ ఫొటోలు

## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫొటో షూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై నటి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫొటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడి నవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫొటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్‌క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.




# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

### తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున

అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అ బి. వ ా న ం ల న ం ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.






# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా: స్రవంతి


హైదరాబాద్, మే 23: గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ స్థాయిలో గుర్తింపు లభించింది. తర్వాత ప్రముఖ రియాలిటీ కార్యక్రమం బిగ్‌బాస్ నాన్‌స్టాప్‌లో పాల్గొని మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం సినిమా ఆడియో వేడుకలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ బిజీగా కొనసాగుతోంది. మరోవైపు నటిగానూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో గ్లామరస్ ఫోటోషూట్లతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# రాష్ట్రంలో ఎండల మోత

- అప్రమత్తంగా ఉండాలి
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు రావొద్దు
- తీవ్ర వడగాల్పులపై హెచ్చరించిన ఏపీఎస్‌డీఎంఏ


**విజయవాడ, మే 23:** రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ప్రాఖర్ జైన్ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ సమస్యలతో బాధపడుతున్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. శనివారం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఆయన వెల్లడించారు. కృష్ణా జిల్లా కానుమోలులో 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 13 జిల్లాల పరిధిలోని 95 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు



వీలైనంత వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావొద్దని సూచించారు. అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో 21 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 214 మండలాల్లో సాధారణ వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి కొనసాగుతోందని పేర్కొంటూ.. నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు, పశు కాపరులు ఉరుములు, పిడుగులు సమయంలో చెట్ల కింద నిలబడకుండా వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ కోసం నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, పిల్లలు, వృద్ధులను ఎండలో ఎక్కువసేపు ఉంచరాదని హెచ్చరించారు.

## వడదెబ్బకు 21 మంది మృతి

**విజయవాడలోనే 10 మంది.. ▪ వీరిలో ఎనిమిది మంది యాచకులు**



**విజయవాడ, మే 23 (మనసులో మాట ప్రతినిధి):** వడదెబ్బ ప్రభావంతో గత రెండురోజుల్లో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 21 మంది మరణించారు. విజయవాడలోనే 10 మంది మృతిచెందారు. వడదెబ్బ వల్లే వీరిలో చాలామంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. వీరిలో రెండు మృతదేహాలు సాధారణ పౌరులవి కావడంతో వాటిని గుర్తించారు. మిగతా ఎనిమిది మంది గుర్తుతెలియని యాచకులని తెలిసింది. సీతారాంపురం చాపరాలవారి వీధిలో అపస్మారక స్థితిలో ఒక వ్యక్తి పడి ఉండగా స్థానికులు గుర్తించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చనిపోయాడు. అజిత్ సింగ్ నగర్ లోని న్యూరాజరాజేశ్వరీపేట రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతిచెందాడు. రాఘవయ్య పార్కుకు సమీపంలో ఒక వ్యక్తి (50) చనిపోయాడు. హనుమాన్ పేటలో జిల్లా జైలు సమీపంలో ఒకరు (65), బీసెంట్ రోడ్డు ఎన్ఐసీ కార్యాలయం వద్ద మరొకరు (65) పడిపోయి ఉండగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. రథం సెంటరు, కాళేశ్వరరావు మార్కెట్టు, గాంధీ పార్కు సెంటరులో ముగ్గురు యాచకులు మరణించారు. కస్తూరిబాయిపేటకు చెందిన దావులూరి రామారావు(57), గుణదల గాంధీబొమ్మ సెంటర్కు చెందిన నిమ్మగడ్డ శరత్ బాబు(45) శుక్రవారం సాయంత్రం నిర్మలా కాన్వెంట్ జంక్షన్ వద్ద రోడ్డుపక్కన స్పృహ లేకుండా పడి ఉన్నారు. స్థానికులు 108కి ఫోన్ చేయగా వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వడదెబ్బకు గురై ఏలూరు జిల్లాలో ముగ్గురు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒకరు మృతి చెందారు. ఏలూరు జిల్లాలో పెదవేగి మండలం జగన్నాథపురానికి చెందిన రాచప్రోలు డేవిడ్ రాజు(64), ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన శేషమ్మ(40), చాట్రాయికి చెందిన సూరవరపు రాణి(65) వడదెబ్బకు గురై మృతిచెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లిలో ఒడిశాలోని రాయగడ జిల్లా రాయికోన ప్రాంతానికి చెందిన రాంపురి పింటు(28) వడదెబ్బతో మృతి చెందారు. కాకినాడ జిల్లాలో ముగ్గురు చనిపోయారు. సర్పవరం పంచాయతీలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్న గుర్రం అప్పన్న (37), గొల్లప్రోలు మండలం చెందుర్తిలో పిల్లి రమణ (55), పిఠాపురంలో కె.అప్పారావు (40) వడదెబ్బతో మరణించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వడదెబ్బతో మృతిచెందారు. మార్కెట్ సెంటర్లో గుర్తుతెలియని వృద్ధుడు (60), పట్టణంలోని చిత్రాలయ సెంటర్లో విజేత సినిమాహాల్ ఎదుట యువకుడు (25-30) ఎండ తీవ్రతతో మృతిచెందారు. వినుకొండ నియోజకవర్గం ఈపూరులో వెలినేని నరసింహారావు (69) వడదెబ్బతో మృతి చెందారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గోవాడలో అట్టా లక్ష్మి అనే మహిళ వడదెబ్బకు మృతిచెందారు.



# ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారంభం

**పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం**

**నాలుగు వారాల పాటు విస్తృత పారిశుధ్య చర్యలు**

**డంప్‌యార్డ్ రహిత నగరాల దిశగా ప్రభుత్వం అడుగులు**

**విజయవాడలో ప్రారంభించిన మంత్రి నారాయణ**

**విజయవాడ, మే 23:** రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ ఆధ్వర్యంలో విజయవాడలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం. ధ్యాన్‌చంద్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే. పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ నాలుగు వారాల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. నగరాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారుల శుభ్రత, కాలువల క్లీనింగ్, చెత్త వర్గీకరణపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత, చెత్త సేకరణ విధానాల్లో మార్పులు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి అత్యంత కీలకమన్నారు. పట్టణాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. డంప్‌యార్డులను తగ్గిస్తూ ఆధునిక చెత్త నిర్వహణ విధానాలను ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. చెత్తను వర్గీకరించి ఇవ్వడం, పబ్లిక్ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. నగరాలను శుభ్రంగా ఉంచేందుకు అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విజయవాడ నగరంలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రతకు కొత్త దిశానిర్దేశం చేసే కార్యక్రమంగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్" నిలవనుందని పేర్కొన్నారు.



# మహానాడును విజయవంతం చేయాలి

- పండుగ వాతావరణంలో నిర్వహించాలి
- క్లస్టర్ బలోపేతానికి ఇదో మంచి అవకాశం
- క్లస్టర్ ఇన్‌చార్జిలతో నారా లోకేష్ దిశానిర్దేశం

**అమరావతి, మే 23:** తెలుగుదేశం పార్టీ మహానాడును రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు సన్నాహకాలపై రాష్ట్రంలోని 1875 క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, తెలుగుదేశం పార్టీ బలం, క్రమశిక్షణ, త్యాగం, సంస్థాగత స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలుగు జాతి అభ్యున్నతి కోసం ఏర్పడిన టీడీపీని మరింత బలోపేతం చేయడానికి మహానాడు వేదిక కావాలన్నారు. కోవిడ్ సమయంలో వర్చువల్‌గా మహానాడు నిర్వహించామని, అనంతరం ఒంగోలులో నిర్వహించిన మహానాడు పార్టీకి విజయాన్ని అందించిందని గుర్తుచేశారు. ఈసారి "స్త్రీ శక్తి మహానాడు" థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, ఇంధన పొదుపు అవసరాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సూచనల మేరకు ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో



ప్రధాన సమావేశాలు జరుగుతాయని, రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్ రూపంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

### క్లస్టర్ స్థాయిలో విస్తృత భాగస్వామ్యం

ప్రతి క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారథులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యులు, పార్టీ కార్యకర్తలు తప్పనిసరిగా మహానాడులో పాల్గొనేలా చూడాలని సూచించారు. క్లస్టర్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇది మంచి అవకాశమన్నారు. మహానాడు నిర్వహణకు అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే పంపించామని, ప్రతి క్లస్టర్‌కు పార్టీ తరఫున అవసరమైన మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాల నిర్వహణకు ఎల్ఈడీ టీవీలు, స్పీకర్లు, సాంకేతిక సదుపాయాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. "మై టీడీపీ" యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో మహానాడు నిర్వహించాలని లోకేష్ పిలుపునిచ్చారు. టీడీపీలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థే శాశ్వతమని పేర్కొన్నారు. ఆ వ్యవస్థను బలోపేతం చేయడానికే క్లస్టర్ ఇన్‌చార్జ్ వ్యవస్థను తీసుకువచ్చామని తెలిపారు. గత 23 నెలలుగా తాను అనేక నియోజకవర్గాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించానని చెప్పారు. ప్రజలతో మమేకమవుతూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

### పనిచేసేవారికే ప్రాధాన్యం

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నామని లోకేష్ స్పష్టం చేశారు. "మై టీడీపీ" యాప్ ద్వారా పనిచేసే వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో అందరూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు

**వైఎస్ మరణం ఎలా జరిగిందో అందరికీ తెలుసు**

**జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపీ సీఎం రమేశ్**

**అమరావతి, మే 23:** పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన అకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ది కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు.





# తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్, మే 23 :** దేశవ్యాప్తంగా బంగారం ధరలు వరుసగా రెండోరోజూ తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు దేశీయ డిమాండ్‌లో మార్పుల కారణంగా పసిడి ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. మరోవైపు వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. నేటి ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.430 తగ్గి రూ.1,59,060కు చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.400 మేర తగ్గి రూ.1,45,800 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2.95 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,690గా నమోదైంది. అక్కడ 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,47,300 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,060గా ఉండగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,45,800గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.1,59,210కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,950 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా డాలర్ మారకపు విలువల్లో మార్పులు, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో కూడా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగొచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# ప్రెగాబాలిన్‌పై కేంద్రం కఠిన ఆంక్షలు

**న్యూఢిల్లీ, మే 23 :** నరాల సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పుల చికిత్సలో విస్తృతంగా ఉపయోగించే ప్రెగాబాలిన్ మందుపై కేంద్ర ఆరోగ్య శాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మందును కొందరు దుర్వినియోగం చేస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ప్రెగాబాలిన్‌ను కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ హెచ్-1 జాబితాలో చేర్చింది. ఈ నిర్ణయం ప్రకారం ఇకపై ప్రెగాబాలిన్ మందును కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా వైద్యుల చిట్టీ అవసరం ఉంటుంది. ఫార్మసీలు ఆ ప్రిస్క్రిప్షన్ ప్రతిని తమ వద్ద భద్రపరచడంతో పాటు, మందు వినియోగదారుల వివరాలను కనీసం మూడు సంవత్సరాల పాటు నమోదు చేసి ఉంచాలని కేంద్రం తన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ప్రెగాబాలిన్ ట్యాబ్లెట్ల వినియోగంపై పలు రాష్ట్రాలు ఇటీవల ఆందోళనలు వ్యక్తం చేశాయి. ముఖ్యంగా యువత ఈ మందును మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు వచ్చిన నివేదికలు కేంద్రాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో అమ్మకాలపై కఠిన నియంత్రణలు అవసరమని ఆరోగ్య శాఖ భావించింది. ప్రభుత్వం ప్రకారం ఈ నిర్ణయం వల్ల మందు సరైన రీతిలో వినియోగించబడటంతో పాటు అక్రమ అమ్మకాలు, దుర్వినియోగాన్ని నియంత్రించవచ్చని భావిస్తున్నారు. డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రెగాబాలిన్ మందును ప్రధానంగా న్యూరోపథీ, ఫైబ్రోమయాల్జియా, దీర్ఘకాలిక నొప్పులు, నరాల సంబంధిత సమస్యల చికిత్సలో వైద్యులు సూచిస్తుంటారు. అయితే మార్కెట్లో ఈ మందుకు భారీ డిమాండ్ ఉండటంతో కొందరు దాన్ని తప్పుగా వినియోగిస్తున్నట్లు ఆరోగ్య శాఖ గుర్తించింది. దేశవ్యాప్తంగా అక్రమంగా ప్రెగాబాలిన్ విక్రయాలు జరుగుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో ఇకపై ఈ మందు ప్యాకెట్లపై 'షెడ్యూల్ హెచ్-1 హెచ్చరిక' తప్పనిసరిగా ముద్రించాలని తయారీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం షెడ్యూల్ హెచ్‌లో ఉన్న ఈ మందును హెచ్-1 కేటగిరీకి మార్చడంతో నియంత్రణ మరింత కఠినమైంది. షెడ్యూల్ హెచ్-1 జాబితాలో సాధారణంగా బలమైన యాంటీబయాటిక్స్, క్షయవ్యాధి మందులు, అలవాటు పడే ప్రమాదం ఉన్న ఔషధాలు ఉంటాయి. 2022లో పశ్చిమ పంజాబ్ ప్రాంతంలో నిర్వహించిన అధ్యయనంలో యువతలో ప్రెగాబాలిన్ దుర్వినియోగం పెరుగుతున్నట్లు వెల్లడైన విషయం తెలిసిందే. దీంతో ఈ మందుపై కఠిన నిఘా అవసరమని నిపుణులు సూచించారు.




# ఇంధన ధరల మోత.. సామాన్యుడిపై మరో భారం

**న్యూఢిల్లీ, మే 23:** దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి భారీ షాక్ ఇచ్చింది. ఇప్పటికే గత కొన్ని రోజుల వ్యవధిలోనే రెండుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన చమురు సంస్థలు.. తాజాగా మూడోసారి కూడా రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు అదనంగా పెరిగాయి. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. వరుస ధరల పెంపులతో సామాన్య ప్రజలపై మరింత ఆర్థిక భారం పడనుంది. గతంలో లీటరు పెట్రోల్‌పై మూడు రూపాయలు పెంచిన చమురు సంస్థలు.. ఆ తర్వాత మరో విడతలో 90 పైసలు పెంచాయి. ఇప్పుడు మూడోసారి కూడా ధరలు పెంచడంతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు గత నాలుగేళ్లుగా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా ఈ పెంపుకు ప్రధాన కారణాలుగా వెల్లడించింది. భారతదేశం తన అవసరాల్లో ఎక్కువ భాగం ముడిచమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుండటంతో అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం నేరుగా దేశీయ ధరలపై పడుతోంది. తాజా ధరల పెంపుతో కేవలం వాహనదారులకే కాకుండా సాధారణ ప్రజలందరికీ ప్రభావం పడనుంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగే అవకాశముంది. దీని ప్రభావం కూరగాయలు, పాలు, పప్పుధాన్యాలు, నిత్యావసర సరుకుల ధరలపై పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.




రవాణా ఛార్జీలు పెరగడం వల్ల మార్కెట్‌లో సరుకుల ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజా పెంపు తర్వాత హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.112.71కు చేరుకోగా, డీజిల్ ధర రూ.100.86గా నమోదైంది. విజయవాడలో పెట్రోల్ ధర రూ.113.95, డీజిల్ ధర రూ.101.11కు చేరుకుంది. ఢిల్లీలో పెట్రోల్ రూ.99.51, డీజిల్ రూ.92.49గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ.108.46, డీజిల్ రూ.94.99గా నమోదైంది. బెంగళూరులో పెట్రోల్ రూ.108.02, డీజిల్ రూ.95.95గా ఉండగా, కోల్‌కతాలో పెట్రోల్ రూ.110.57, డీజిల్ రూ.96.98కు చేరాయి. చెన్నైలో పెట్రోల్ రూ.105.38, డీజిల్ రూ.97.02గా కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నగరాల్లో పెట్రోల్ ధరలు రూ.112 మార్కును దాటిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ధరల పెంపుతో కుటుంబ బడ్జెట్ దెబ్బతింటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకంతో

# స్థిరమైన నెలవారీ ఆదాయం

**న్యూఢిల్లీ, మే 23 :** ఎలాంటి రిస్క్ లేకుండా ప్రతి నెలా స్థిరమైన ఆదాయం కావాలనుకునే పెట్టుబడిదారులకు పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకం (పిఓఎంఐఎస్) మంచి ఎంపికగా మారుతోంది. మార్కెట్‌లో వచ్చే హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా నమ్మకమైన రాబడి అందించే ఈ పథకం ముఖ్యంగా పదవీ విరమణ చేసినవారికి, సురక్షిత పెట్టుబడిని కోరుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకంలో వ్యక్తిగత ఖాతాదారుడు గరిష్ఠంగా రూ.9 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. అదే జాయింట్ ఖాతా అయితే రూ.15 లక్షల వరకు పెట్టుబడి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 7.4 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది. ఈ వడ్డీ ప్రతి నెలా ఖాతాదారుడి ఖాతాలో జమ అవుతుంది. వడ్డీ రేట్లను ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంది. రూ.15 లక్షల జాయింట్ పెట్టుబడిపై నెలకు



సుమారు రూ.9,249 వరకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. ఏడాదికి దాదాపు రూ.1,11,000 వరకు వడ్డీ పొందే అవకాశం ఉంటుంది. ఐదు సంవత్సరాల కాలపరిమితిలో మొత్తం సుమారు రూ.5,55,000 వరకు వడ్డీ ఆదాయం పొందవచ్చని అంచనా వేయబడుతోంది. ఈ పథకానికి ఐదు సంవత్సరాల మెచ్యూరిటీ కాలం ఉంటుంది. పెట్టుబడి చేసిన మొదటి సంవత్సరం పూర్తయ్యే వరకు డబ్బు ఉపసంహరించుకునే అవకాశం ఉండదు. మూడు సంవత్సరాల లోపు ఖాతా మూసివేస్తే రెండు శాతం కోత విధిస్తారు. మూడు సంవత్సరాల తర్వాత మూసివేస్తే ఒక శాతం కోత విధించే నిబంధన ఉంది. పన్ను విషయానికి వస్తే ఈ పథకంలో పెట్టుబడులకు ప్రత్యేక పన్ను మినహాయింపు ఉండదు. పొందిన వడ్డీని వ్యక్తిగత ఆదాయంలో కలిపి, ఉన్న పన్ను శ్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే వడ్డీపై ముందస్తు పన్ను కోత ఉండదు కాబట్టి పెట్టుబడిదారుడికి మొత్తం వడ్డీ నేరుగా అందుతుంది. సురక్షితమైన ఆదాయం, స్థిరమైన రాబడి కోరుకునేవారికి ఈ పథకం ఇప్పటికీ నమ్మదగిన ఎంపికగా కొనసాగుతోంది.

# అమెజాన్‌లో 100కుపైగా కొత్త బ్యూటీ బ్రాండ్లు

**న్యూఢిల్లీ, మే 23:** భారత ఈ-కామర్స్ రంగంలో అగ్రగామి సంస్థ అమెజాన్ ఇండియా తన సౌందర్య ఉత్పత్తుల విభాగాన్ని మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలు రూపొందించింది. దేశంలో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 2026 సంవత్సరంలో 100కు పైగా అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లను తమ వేదికలో ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ కొత్త జాబితాలో ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లు అయిన డోల్సె అండ్ గబ్బానా, లారా మెర్సియర్, ఎలెమిస్, అర్బన్ డీకే, అవెడా, లా రోష్ పోసే వంటి ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్లు ఉండనున్నాయి. అమెరికా, యూరప్ దేశాలకు చెందిన ఉత్పత్తులతో పాటు జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల ప్రత్యేక చర్మ సంరక్షణ ఉత్పత్తులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మధ్యప్రాచ్య దేశాలకు చెందిన ఊద్, అత్తర్ వంటి ప్రీమియం సుగంధ ద్రవ్య బ్రాండ్లను కూడా అమెజాన్ తన వేదికలో అందించనుంది. రాబోయే జూలై నెల 'ప్రైమ్ డే' అమ్మకాల సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు, భారీ తగ్గింపులు, ప్రత్యేక ప్రారంభ విక్రయాలు నిర్వహించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ నివేదికలో ఆసక్తికర అంశం ఏమిటంటే ప్రీమియం సౌందర్య ఉత్పత్తుల కొనుగోళ్లలో సగానికి పైగా డిమాండ్ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచే వస్తోంది. త్రిస్సూర్, డెహ్రాడూన్, పాటియాలా, గౌహతి, కొల్హాపూర్ వంటి నగరాల్లో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరుగుతున్నట్లు అమెజాన్ తెలిపింది. కొరియన్ చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ఫ్రెంచ్ ఫార్మసీ బ్రాండ్లకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తోందని సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా పురుషుల ప్రీమియం గ్రూమింగ్ విభాగం ఏటా రెండున్నర రెట్లు వృద్ధి నమోదు చేస్తోందని పేర్కొంది. వినియోగదారుల షాపింగ్ అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను కూడా వినియోగిస్తోంది. 'రూఫస్' అనే జనరేటివ్ ఏఐ షాపింగ్ అసిస్టెంట్, 'అమెజాన్ లెన్స్' వంటి సాంకేతికతల ద్వారా వినియోగదారులు తమ చర్మ తత్వానికి సరిపోయే ఉత్పత్తులను సులభంగా ఎంపిక




చేసుకునే అవకాశం కల్పిస్తోంది. అదే సమయంలో డెలివరీ వ్యవస్థను కూడా సంస్థ బలోపేతం చేసింది. దేశంలోని టాప్ 100 నగరాల్లో సగానికి పైగా బ్యూటీ ఆర్డర్‌లను అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేసేలా లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు అమెజాన్ వెల్లడించింది.

# ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్త రోర్ ఈవో బైక్ విడుదల



**హైదరాబాద్, మే 23:** దేశీయ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ మరో సరికొత్త మోడల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'రోర్ ఈవో' పేరుతో విడుదల చేసిన ఈ బైక్‌ను ప్రత్యేక ప్రారంభ ధర రూ.99,999కు ప్రవేశపెట్టింది. అయితే ఈ ధర తొలి 10 వేల బుకింగ్‌లకు మాత్రమే వర్తిస్తుందని కంపెనీ స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ బైక్ ధర రూ.1,24,999కు పెరగనుంది. కంపెనీ వివరాల ప్రకారం ఈ బైక్‌లో 3.4 కిలోవాట్ లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) బ్యాటరీను ఉపయోగించారు. ఈ బ్యాటరీ ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సుమారు 180 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. అలాగే ఈ బైక్ కేవలం 3 సెకన్లలోనే 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని, గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందని కంపెనీ వెల్లడించింది. ఇంకా ముఖ్యంగా ఈ బైక్ బ్యాటరీ కేవలం 90 నిమిషాల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుందని సంస్థ తెలిపింది. ఈ బ్యాటరీకి 8 సంవత్సరాల వారంటీ ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి ఉన్న వినియోగదారులను ఇది ఆకట్టుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సందర్భంగా ఒబెన్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) హర్షవర్ధన్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీకి 5 షోరూమ్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వాటిని 25కి పెంచే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో హైదరాబాద్ వాటా సుమారు 10 శాతంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు.